వ్యవస్థాపకులు

**కీ||శే|| మునుగంటి శ్రీరామమూర్తి**

గౌరవ సంపాదకులు

**డా|| శ్రీమాన్ కొమాండూరి శేషాద్రి**

సంపాదకుడు

**మునుగంటి వెంకట్రావు**

62వ సంవత్సరపు ప్రచురణ

# గానకళ

సంగీత మాసపత్రిక

అంతర్జాతీయ సంగీత మాసపత్రిక

సంపుటి - 62 | సంచిక - 6, 7, 8

నవంబరు, డిసెంబర్ 2023
జనవరి 2024



గానకళ పాఠకులకు సంక్రాంతి శుభాకాంక్షలు







62వ సంవత్సరపు ప్రచురణ

గానకళ

అంతర్జాతీయ సంగీత మాసపత్రిక

30-1-29, రంగయ్యనాయుడువీధి, కాకినాడ - 533001, సెల్ : 9441488721

సహాయ సంపాదకులు

**శ్రీ వాసా గోపీనాధరావు**
విశ్రాంత ప్రిన్సిపాల్, సంగీత నృత్యకళాశాల, హైదరాబాద్

**శ్రీ కె.వి. బ్రహ్మానందం**
విశ్రాంతాచార్యులు, ప్రభుత్వ సంగీత నృత్యకళాశాల, విజయవాడ

**శ్రీ మండలీక సీతారాఘవరావు**, చెన్నై

**శ్రీ జయంతి సత్యనారాయణ శాస్త్రి**, కాకినాడ

సంపుటి - 62 | నవంబరు, డిసెంబర్ 2023 - జనవరి 2024 | సంచిక - 6, 7,8

**సంపాదకవర్గం :**
శ్రీ ఆకెళ్ల మల్లికార్జునశర్మ
శ్రీ మల్లాది సూరిబాబు
శ్రీ పి.వి.ఎస్. శేషయ్యశాస్త్రి
డా॥ శ్రీమతి ద్వారం వి.జె.లక్ష్మి
డా॥ వైజర్సు బాలసుబ్రహ్మణ్యం
డా॥ ఎమ్. పురుషోత్తమాచార్య
శ్రీ కె.ఎస్.ఆర్. బాలకృష్ణ శాస్త్రి
శ్రీ జొన్నలగడ్డ సూర్య ఈశ్వర ప్రసాద్
శ్రీ విష్ణుభట్ల శ్రీరామ చంద్రమూర్తి
విజయనగరం కుమారి డి. వర్ధని
డా॥ ఆర్. మాధురి దేవి
శ్రీమతి బురిడి అనూరాధ పరుశురాం
శ్రీ ఎమ్. వి. సింహాచల శాస్త్రి భాగవతార్
శ్రీ ఇ.వి.కృష్ణమాచార్యులు

**సారధ్య సంఘం :**
శ్రీ ఎం.ఎస్. శ్రీనివాస్
శ్రీ ఎన్.వి. రమణ
శ్రీ బి. మారుతీ రఘురామ్
శ్రీ ఎమ్. అచ్యుత రామయ్య
డా॥ శ్రీమతి టి. సూర్యకాంతం
శ్రీమతి నూలి వెంకట లక్ష్మిదేవి, M.A.,M.A.,M.A
శ్రీమతి వై. రమాప్రభ, M.A., (Music)
శ్రీమతి ఎస్. సుబ్బలక్ష్మి, M.A.,M.A.,M.A. (Music)
శ్రీమతి పి. రమాదేవి, హనుమకొండ
శ్రీమతి ప్రభల రాజేశ్వరి
శ్రీమతి ఎ. భారతీదేవి, గుంటూరు
శ్రీమతి ఎమ్.వై. శేషురాణి, గుంటూరు
కుమారి మండపాక నాగలక్ష్మి

## ఈ సంచికలో....

| | | | పేజీలలో |
|---|---|---|---|
| 1. | నా స్వగతం | - శ్రీ మల్లాది సూరిబాబు | 3 |
| 2. | శివానందుల కటాక్షం | - శ్రీ మోదుమూడి సుధాకర్ | 6 |
| 3. | స్మరణే సుఖము - జనరంజని | - శ్రీ ఆలమూరు విజయభాస్కర్ | 7 |
| 4. | మన క్షేత్రయ్య - కథాకమామిషు | - ప్రొ. విస్సా అప్పారావు | 12 |
| 5. | భక్తి వివిధ అంశాల సమన్వయ విశ్లేషణ | - డా. శ్రీమతి సి. ఉమాప్రసాద్ | 17 |
| 6. | మార్గళి మహోత్సవం.... | - శ్రీ మోదుమూడి సుధాకర్ | 20 |
| 7. | BHARAT RATNA Bismillah Khan | - Cdr G. Sriramarao | 23 |
| 8. | సంగీత సభల కార్యకలాపములు | - 'విహారి' | 26 |


## ముఖచిత్రం

1. విశాఖ మ్యూజిక్ అకాడమీ ప్రతిష్ఠాకరమైన "సంగీతకళాసాగర" బిరుదును స్వీకరిస్తూన్న విద్వన్మణి శ్రీమతి ముట్నూరి జలజాక్షి.
2. విశాఖ మ్యూజిక్ అకాడమీ కార్యవర్గసభ్యుల అభిమానపూర్వక సన్మాన మందుకుంటూన్న అకాడమీ అధ్యక్షులు శ్రీ యస్వీ రంగరాజన్.
3. 16.1.24న లేపాక్షి లో జరిగిన కార్యక్రమం లో విదుషి శ్రీమతి కె. వందన మరియు విద్వాన్ కొమాండూరి వెంకట కృష్ణ, విద్వాన్ కోటిపల్లి రమేష్ లను ముఖ్యఅతిథి ప్రధాన మంత్రి గౌరవనీయులు శ్రీ నరేంద్ర మోడీ సత్కరిస్తున్న దృశ్యం.

Email : ganakalamagazine@yahoo.co.in కు కళాకారులు, సంస్థలు వార్తలు, ఫోటోలు పంపవచ్చు.

**ganakala.in వెబ్ పేజీలో గానకళ పూర్వ సంచికలు, కొత్త సంచికలు చూడవచ్చు.**

# నా స్వగతం



మల్లాది సూరిబాబు

ఎనౌన్సర్ గా, 1970 లో విజయవాడ ఆకాశవాణి కేంద్రంలో అడుగుపెట్టాను. ప్రవృత్తి సంగీతమవడంతో వీలైనప్పుడల్లా మ్యూజిక్ స్టూడియోలో జరిగే సంగీత కార్యక్రమాలకు వెళ్ళి వింటూండేవాడిని. రికార్డు లైబ్రరీలో కూర్చుని నాకిష్టమైన విద్వాంసుల పాట వినేవాడిని. పైగా, వివిధ భారతిలో ఉద్యోగమవ్వడంతో వివిధ ప్రాంతాల్లో పాడే, లలిత, జానపద సంగీతరీతులు, పాశ్చాత్యపోకడలతో పాడే పాటలు చెవినబడేవి. పంకజ్ మల్లిక్, సిహెచ్.ఆత్మ, సైగల్ వంటి గాయకుల గొంతులో మంద్రస్థాయి సంగీతం ఎంతో హాయిగా వినేవాడిని. ఉత్తర హిందూస్తాన్, దక్షిణప్రాంతంలోని తమిళ్ నాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లో పాడుకునే పాటలన్నీ వినేవాడిని. ఆ రోజుల్లో బొంబాయి నుండి టేపులు వచ్చేవి. ఉదయం ఓ పది, మధ్యాహ్నం ఆఱు, రాత్రి మరో 10, అరగంట నిడివిగల టేపులు, ప్రసారం చేసే ఉద్యోగం.

ప్రసారమయ్యే సమయంలో స్టూడియో వదిలి వెళ్తే, టేపులు అతుక్కుని పొరబాటున ఆగిపోయే ప్రమాదముంది. అక్కడే కూర్చుని విధిగా విని తీరాలి. అదే నాకు పెద్ద వరంగా మారిందనే చెప్పాలి. అంతేకాదు వినగా వినగా లభించిన జ్ఞానం నా అంతట నేను పాటలు కంపోజ్ చేయడానికి దోహదం చేసింది.

రకరకాల శీర్షికలతో హిందీ పాటలు ఎక్కువగా ప్రసారమవుతుండేవి. అవే నాకు స్ఫూర్తినిచ్చేవి. కొంతకాలానికి, ఏవేవో సంగీత రూపకాలకు పాటలు కంపోజ్ చేసే అవకాశం లభించింది. అన్నవరపు రామస్వామి, కృష్ణమాచార్యులు, దత్తాడ పాండురంగ రాజు, అందుకూరి యజ్ఞనారాయణ శాస్త్రి, దండమూడి రామ్మోహనరావు, క్రొవ్విడి సీతారాం, చార్లీస్ విలియమ్స్(తబ్లా), కనకారావు (సితార) కన్నన్, వెలిదిసుబ్బారావు, సుందరపల్లి సూర్యనారాయణ, ఖాసింసాహిబ్ మొదలైన అనేకమంది విద్వాంసులతో రేడియో ప్రాంగణమంతా ఎంతో శోభాయమానంగా, ఇంద్రసభలా వెలిగిపోతుండేది.

కుటుంబనియంత్రణ, పారిశ్రామికాభివృద్ధి, కుటుంబ సంక్షేమం, పిల్లల పాఠ్యాంశాలకు సంబంధించిన కార్యక్రమాలకోసం ఏవేవో పాటలు కంపోజ్ చేయటం మొదలయ్యింది.

ఎటువంటి పాటకైనా, వాద్యబృందం

ఉండాలిగదా? నేను చేసిన సామాన్యమైన సందేశాత్మక గీతాలు, పాటలు, పెద్ద విద్వాంసులతో లలిత సంగీతం పాడించడం మొహమాటంగా ఉండేది. సంగీత కచేరీలు చేసి, కర్ణాటక సంగీత విద్వాంసులుగా గుర్తింపు తెచ్చుకున్న ఈ కళాకారులను లలిత సంగీత గీతాలకు వినియోగించడం ఒక సాహసమే. కానీ ఉద్యోగ ధర్మం వల్ల కాదనక కూర్చునేవారు.

సినిమా ఆర్కెష్ట్రా సంగతి వేరు. కాల్ షీట్లుంటాయి. నిర్దిష్టమైన సమయాలకు కొంత పారితోషికం ఉంటుంది. కంపోజర్ చెప్పిన చిన్న చిన్న బిట్లు, వారి కోరినట్లు వాద్యాల్లో పలికించేస్తే చాలు. అలా రికార్డింగ్ అవ్వగానే యిలా పారితోషికం అందుకుని మరో స్టూడియోకు వెళ్ళిపోతారు. వారికో యూనియన్ ఉంటుంది. సినీ ఆర్కెష్ట్రాలో సంగీత కచేరీలు చేసే కళాకారులు గానీ, విద్వాంసులు గానీ అరుదుగా ఉంటారు. కానీ రేడియో కేంద్రాల్లో ఆయా రంగాలలో పరిణతి చెందిన నిలయ విద్వాంసులే ఉంటారు. లలిత సంగీతం పాడేవారి ఎదురుగా ఈ విద్వాంసులుంటే చెప్పాలా? బెదురు చూపులతో భయపడిపోతూ పాడేవారు. సోమవారాల్లో మధ్యాహ్నం 1.30 గం.లకు ఈ నిలయ విద్వాంసుల వాద్య బృందం కీర్తనలు వీనుల విందుగా అరగంట సేపు వినిపించేవారు. అదంతా గతవైభవం. అప్పుడు నిలయ విద్వాంసుల సంఖ్య రెండు పదులకు పైమాటే! యిప్పుడు చెప్పాలంటే మన చేతివేళ్ళు ఎక్కువే. యక్షగానాలు, సంగీతరూపకాలు, జాతీయస్థాయిలో అవార్డులు సంపాదించుకున్న కార్యక్రమాలు, ముఖ్యంగా భక్తిరంజని కార్యక్రమంలో ఈ రోజుకూ నిర్విఘ్నంగా ప్రసారమవుతున్న అనేక అపురూపమైన కృతులు వెనుక వారి అకుంఠిత కృషి ఉంది. ఉద్యోగమే కదా అనే భావంతో యాంత్రికంగా ఉండేవారు కాదు.

నిజాయితీ, నిబద్ధత, వృత్తిపట్ల అంకితభావం, సంగీత గౌరవంతో విజయవాడ రేడియో కేంద్రానికి వీరే కీర్తి ప్రతిష్టలు తెచ్చారనటంతో సందేహం లేదు.

కాలక్రమంలో లలితసంగీతం పాడేవారి సంఖ్య పెరిగింది. కుటుంబ నియంత్రణ, ఉన్నత పాఠశాలా విద్యా కార్యక్రమాలు, యితర శాఖల నుండి కూడా ఏవేవో సంగీత రూపకాలు తయారవుతూండేవి. వీటికోసం ప్రత్యేకంగా బడ్జెట్ ఉండేది. మల్లిక్, ఎన్.సి.వి. జగన్నాధాచార్యులు, వి.ఎస్. నారాయణమూర్తి, నేనూ రకరకాల పాటలతో సిద్ధమయ్యేవారం. కొన్ని కొన్ని ప్రత్యేక కార్యక్రమాలుండేవి. రిహార్సల్స్, రికార్డింగు, నాలుగైదు రోజుల పాటు సాగిన సందర్భాలున్నాయి.

స్టూడియోలన్నీ పండగవాతావరణాన్ని తలపించేవి. O.B. (Out Door Beast) లైతే మరీ సందడిగా ఉండేది.

ఆకాశవాణి కేంద్రాలకు శోభను తెచ్చిపెట్టేది ఈ నిలయకళాకారులే. దైవదత్తమైన విద్యను గురుముఖంగా నేర్చుకుని ఆకాశవాణి వల్ల కీర్తి నార్జించినవారు, ఆ సంస్థకే పేరు తెచ్చినవారూ

ఉన్నారు. తెలుగువారికోసం రేడియోకేంద్రం కావాలని ఎందరో కృషి చేశారు.

1948 లో విజయవాడ ఆకాశాణి ఏర్పాటుకు ముందు, తెలుగు కార్యక్రమాలు మద్రాసు కేంద్రం నుండి ప్రసారమవుతూండేవి. అప్పటి కేంద్ర మంత్రి కేస్కర్ వల్ల (ప్రసారమంత్రిత్వశాఖా మంత్రి) రేడియో కార్యక్రమ ప్రసారాలలో కొంతమార్పు వచ్చిందనుకునేవారు.

సంగీత, సాహిత్య సవ్యసాచియైన శ్రీ డా. బాలాంత్రపు రజనీకాంతరావు నిజానికి ఆకాశవాణి వైభవానికి మార్గదర్శిగా భావిస్తారు. ఉన్నతమైన సంగీత ప్రమాణాలతో మదరాసు స్టూడియోలో చక్కని గాయకులతో లలిత గీతాలు రికార్డవడానికి కారకుడు, ప్రేరకుడు రజనీయే.

మద్రాసు రేడియో కేంద్రంలో లైట్ మ్యూజిక్ యూనిట్ ను ప్రారంభించి గీతావళిలో (లలిత సంగీత కార్యక్రమం) బాగా పాడుతూ A గ్రేడ్ స్థాయి తెచ్చుకున్న గాయనీ గాయకులను ఎంపిక చేసి, పసందైన బాణీలతో 78 RPM రికార్డుల్లో వారి పాటలను రికార్డ్ చేశారు.

వాటిని టి.ఎస్. రికార్డ్సు అంటారు. ఒక్క లలిత గీతాలే గాదు. రెండు, రెండున్నర నిమిషాల వ్యవధిలో చిన్న చిన్న కీర్తనలు, వాద్య సంగీతం యితర ప్రాంత జానపద రీతుల్లోని పాటలు, ఆయా ప్రధాన రేడియో కేంద్రాల్లో తయారయ్యేవి. కొన్ని రేడియో స్టేషన్ల రికార్డ్ లైబ్రరీలలో యివన్నీ భద్రపరిచారు.

మహా ప్రవాహంలో పెద్ద పెద్ద మానులు కూడా కొట్టుకుపోతూంటాయి. అలానే మధురాతి మధురంగా, ఎందరో గాయకుల పాటలు కూడా కొన్ని అదృశ్యమై వినటానికి నోచుకోలేదు. కనుమరుగైపోయాయి. రేడియో కేంద్రాల్లో పనిచేసే చాలా మంది అధికారులకు యివి అసలున్నట్లే తెలియదు. అదీ చిత్రం.

లలిత సంగీతానికి వాద్యబృంద సహకారం ఉండితీరాలి. కర్ణాటక సంగీతానికి రెండు మూడు సహకార వాద్యాలు చాలు. వీణ, వయోలిన్, క్లారినెట్, వేణువు, తబ్లా వాద్యాలు లలితసంగీతానికి అవసరం. ఈ వాద్యాలతోనే అపురూపమైన ఆకాశవాణి గీతాలు ఆ రోజుల్లో శ్రవణపేయంగా విన్నవారి హృదయాలలో శాశ్వతంగా నిలిచిపోయాయి.

ఈ వేళ ప్రతి రేడియో కేంద్రానికి లలిత సంగీత గాయనీ గాయకులున్నారు. కానీ, బాగా పరిణితి చెందిన వారు, పది పదిహేను మందికంటే ఉండరు.

1970, 85 సంవత్సరాల మధ్య విజయవాడ ఆకాశవాణి కేంద్రం ఓ స్వర్ణయుగం. రెండు వేల సంవత్సరం ఆరంభంతో క్రమంగా ఆవైభవం తగ్గడం మొదలైంది. దృశ్యమాధ్యమాల ధాటికి ఇంక రేడియో తట్టుకోలేదన్న సంగతి కాదనలేని నిజం.

(సశేషం)


★ ★ ★

సుధాతరంగము

# శివానందుల కటాక్షం గంగాతరంగలహరి - నాదయాత్ర



- మోదుమూడి సుధాకర్
9885183988. విజయవాడ



శతాధికులైన శివానందమూర్తిగారి శిష్యులు వెంటరాగా,మాకందరికీ అక్కడి ప్రతి ఆలయాన్నీ చూపుతూ,అక్కడి చరిత్రను వివరిస్తూ, మమ్మల్ని ఆ ఆలయాలలో కూర్చొబెట్టి,పాడించారు శివానందమూర్తిగారు.వారి శిష్యులలో ఉన్నత పదవుల్లో ఉన్న అధికారులు ఎంతోమంది ఉండటంతో, అక్కడ అన్ని ఏర్పాట్లూ ఎంతో అద్భుతంగా సమకూర్చారు వారు.

ఒక్కొక్క ఆలయాన్ని దర్శిస్తూ,అక్కడ నాదయోగులు రచించిన కీర్తనలను గర్భాలయాలలో పాడుకొన్నాము మేము.ఉదాహరణకు...డూండి గణేశుడి ముంగిట దీక్షితులవారి శంకరాభరణ రాగ కృతి ''శక్తి సహిత గణపతిం'',విశ్వనాథ మందిరంలో చతుర్దశ రాగమాలిక 'శ్రీ విశ్వనాథం భజేహం', అన్నపూర్ణ సమక్షంలో సామరాగ కృతి 'అన్నపూర్ణే విశాలాక్షి', కాలభైరవుడి కొలువులో భైరవ రాగంలో ''కాలభైరవం భజే'', విశాలాక్షి సన్నిధిలో శ్యామశాస్త్రిగారి ఆనందభైరవి కృతి ' ఓ జగదంబా!', సంకటమోచన్ హనుమాన్ మందిరంలో త్యాగయ్య కృతి ''బంటురీతి కొలువియ్యవయ్య'' హంసనాద రాగ కృతి..ఈ విధంగా...కృతులను కొన్ని విడి విడిగాను, మరికొన్ని బృందంగాను పాడుకున్నాము. కొన్ని అంశాలను విస్తరించి, రాగాలాపన చేసి,ఒకరి తరువాత ఒకరు స్వర కల్పనలు కూడా చేశాము. విశ్వనాథుడి మందిరంలో మాగానం, రెండుగంటల కచేరీలాగా కొనసాగింది. మాతోవచ్చిన భక్త బృందంతో పాటు, అనేకమంది స్థానిక సంగీత ప్రియులూ మా సంగీతానికి సమ్మోహితులయ్యారు!

సాయంసమయంలో గంగానది మధ్యకు ఒక బోటులో వెళ్ళి, ఇసుక తిన్నెలపై కూర్చొని,' గంగాష్టకాన్ని', సదాశివబ్రహ్మేంద్ర విరచిత 'తుంగతరంగే గంగే ' వంటి కీర్తనలు పాడుతున్నప్పుడు నాకనిపించింది..'ఆహా! వీటిని రచించిన వాగ్గేయకారులు ఎంత పుణ్యంచేసుకొన్నారు! వందల సంవత్సరాలకు పూర్వం వారు పాడుకొని,ధన్యులవటమేకాక,నావంటి పామరుణ్ణి ఈనాటికి తమ రచనలతో తరింపచేస్తున్న ఆ మహానుభావుల ఋణం ఎలా తీర్చుకోగలను? నిజానికి వాటిని పాడుకోవలసిన సరియైన వేదికలు ఈ క్షేత్రాలేకదా?

మా గాయకబృందమంతటికీ కాశీఖండమంతా నాదమయంగా దర్శనమిచ్చింది...

# స్మరణే సుఖము - జనరంజని - త్యాగరాజ హృదయధ్వని



- ఆలమూరు విజయభాస్కర్

ప. స్మరణే సుఖము రామ నామ
నరుడై పుట్టినందుకు నామ (స్మ)

అ. వర రాజ యోగ నిష్ఠులౌ
వారికానందమందెటట్లు (స్మ)

చ. రామ నామ (శ్రవణము) స్మరణము వల్లనే
నామ రూపమే హృదయము నిండి
ప్రేమ పుట్ట సేయగ లేదా
నిష్కామ త్యాగరాజు సేయు నామ (స్మ)

**ఉపోద్ఘాతము:**

**శాంతరసము:**

సంగీతకళకు రసానుభవమే లక్ష్యము. అట్టి అద్భుత రసానుభవమును కలిగించు నవరసములలో శాంతరసము అత్యంత విలక్షణమైనది.

చారిత్రికముగా తొలుత భరతముని తన నాట్యశాస్త్రమునందు అద్భుత, వీర, శృంగార, హాస్య, కరుణ, రౌద్ర, భయానక, భీభత్సములనే ఎనిమిది రసములను నిర్వచించి, వివిధకళలయందు ఆయారసములవలన కలుగు రసానుభవము కళాప్రియులకు, రసికులకు ఆనందదాయకమని ప్రతిపాదించెను.

ఆనందవర్ధనుడు శాంతరసమును తొల్లి భరతుడు నిర్వచించిన ఎనిమిది రసములకు

---

సద్గురు శివానందమూర్తిగారు, కాశీక్షేత్రంలోని సంత్ తులసీదాస్, త్రైలింగస్వామి,కరపాత్రి స్వామి మొదలైన మహానుభావుల ఆశ్రమాలకు తీసుకొనివెళ్ళి,వారి మహిమాన్విత చరిత్రను వర్ణించారు. గంగానదిలో ముత్తుస్వామి దీక్షితులవారికి,తమ గురు ఆశీస్సులతో వీణ లభించిన తావును, ఆ ఒడ్డునే హనుమాన్ ఘాట్ లో ఉన్న దీక్షితులవారి విగ్రహాన్ని చూపారు.దీక్షితులవారి గురువు చిదంబరనాదయోగి సమాధిని,అక్కడ ప్రతిష్ఠించిన శ్రీచక్ర లింగాన్ని దర్శించి,నమస్కరించుకొన్నాము.

రాత్రికి నయనమనోహరమైన గంగాహారతిని దర్శించాము.

శ్రీరామ తారకాంధ్రాశ్రమంలో నాకు ఎంతో చక్కని ఆతిథ్యమిచ్చి, గౌరవించారు నా శిష్యుడైన వేమూరి విశ్వనాథ్ సోదరులు సుందరంగారు.

నాద యాత్ర దిగ్విజయవంతంగా ముగిసింది. మా సంగీతకళాకారులకు అలాంటి సువర్ణావకాశం కలిగించిన సద్గురు శివానందమూర్తిగారికి,అదే తన చివరి కాశీ దర్శనం అని ముందే తెలుసేమో! అందుకే చాలా సందర్భాలలో తిరిగితిరిగి ఆ క్షేత్ర దర్శనం చేస్తూ, రత్నాలవంటి ఆ రచనలు వింటూ.. ఎంతో భావోద్వేగానికి గురి అయ్యారాయన!.. వారికి నా హృదయపూర్వక శ్రద్ధాంజలి!!

చేర్చి మొత్తముగా ఉన్నవి తొమ్మిది రసములని నిరూపించెను.

నవరసములలో ఏది గొప్పరసము అని ఆలోచించిన పండితులు భిన్నాభిప్రాయములను ప్రకటించారు. భవభూతి '"ఏకోరసః కరుణయేవ" అని ప్రతిపాదించెను. విశ్వనాథుడు '"శృంగారమ్ రసరాజమ్" అనియూ ప్రతిపాదించారు.

కాని పండిత ఆనందవర్ధనుడు, శాంతరసమే తక్కిన అన్నిరసములకూ మూలమనియూ, శృంగారాది రసములన్నీ శాంతరసములోనే ఉద్భవించి, తుదకు శాంతరసములోనే అణిగిపోవుననీ సిద్ధాంతీకరించి, శాంతరసమునకు సర్వోత్కృష్టమైన స్థానమును కల్పించెను.

దీనికి భౌతికశాస్త్రములో మనము సరియైన ఉదాహరణను చూడగలము...

తెల్లని కాంతికిరణములను శాంతరసముతో పోల్చినచో, ఆ తెల్లని కాంతికిరణములు వికీర్ణము చెందినప్పుడు, అది సప్తవర్ణముల కాంతికిరణములుగా విడిపోవును.

అట్లే, శాంతరసములో సంచలనములు కలిగినప్పుడు, తక్కిన అష్టరసములు ఉద్భవించును.

ఏవిధముగా ఆ సప్తవర్ణముల కాంతికిరణములు తిరిగి సంకీర్ణము చెందినప్పుడు మరల అవి తెల్లని కాంతికిరణములుగా పరివర్తన చెందుతాయో, అదేవిధముగా అద్భుతాది ఎనిమిది రసములు అణిగినపుడు, అక్కడ తిరిగి శాంతరసమే మనకు గోచరమౌతుంది.

సాధారణంగా, వాగ్గేయకారులు తమ కృతులలో, సంగీతకళాకారులు తమగానములో అద్భుత, శృంగార, వీర, కరుణ రసావిష్కరణ చేయుట మనకు సుపరిచితమే.

అందంగా, భావభరితంగా గానంచేసిన ప్రతీసారీ శృంగారాది మొదటి ఎనిమిది రసములే ఆవిష్కరించబడతాయి. సాధారణస్థాయి శ్రోతలను, గాయకులను ఈ ఎనిమిది రసములు ఎంతో రంజింపజేస్తాయి.

కానీ, ఈ శాంతరసావిష్కరణ, ప్రత్యేకించి సంగీతమునందు, అతిక్లిష్టమైనది. ఎందుకంటే అద్భుత, శృంగారాది రసములనుండి ఆవిర్భవించు భావములన్నీ అణగిపోయినప్పుడే శమము అనే భావముద్భవించి, తద్వారా శాంతరసావిష్కరణ సాధ్యమౌతుంది.

ఈ శమము కేవలం తపస్సంపన్నులైన యోగులకే సాధ్యము. ప్రత్యేకించి సంగీతములో ఈ శాంతరసావిష్కరణ కామక్రోధాదిషడ్రిపులని జయించి, మహర్షితుల్యులైన నాదయోగులు మాత్రమే చేయగలరు.

త్యాగరాజస్వామి అత్యుత్తమస్థాయికి చేరిన తరువాత రచించిన శాంతరసభరిత కృతులలో మకుటాయమానమైనది జనరంజని రాగంలోని స్మరణే సుఖము అనే ఈ కృతి.

సాధారణంగా జనరంజని రాగంలో వీరరసము

కనబడుతుంది. దీనికి ఉదాహరణగా త్యాగరాజస్వామి రచించిన ''విడజాలదురా నా మనసు వినరాదా'' కృతిని చూపవచ్చు. ఈ కృతిని ద్రుత గతిలో దృఢనిశ్చయమను భావాన్ని హృదయమున నిలుపుకొని, ఉత్తమ కళాకారులు పాడినప్పుడు, ఉద్భవించే వీరరసము అద్భుతానందాన్ని కలిగిస్తుంది.

ఇందులో సంగీతసాహిత్యాలపై పట్టుసాధించి, ఉత్తమవాగ్గేయకారునిగా మారిన త్యాగరాజస్వామి యొక్క ఆర్తి మనకు దృగ్గోచరమౌతుంది.

కాని, ఈ "స్మరణే సుఖము" కృతిలో మనకు త్యాగరాజస్వామి తాపత్రయములను అధిగమించి పరమశాంతచిత్తుడైన రాజయోగిగా, నాదయోగిగా దర్శనమిస్తారు. మానవులకు అతిసులభమైన మోక్షమార్గాన్ని సూచిస్తారు. ఇప్పుడు ఈ కృతిలోని మర్మములను తెలుసుకుందాము.

**ప. స్మరణే సుఖము రామ నామ**
**నరుడై పుట్టినందుకు నామ (స్మ)**

ఈ పల్లవిలో, త్యాగరాజస్వామి నవవిధభక్తి స్థాయిలలో అతిముఖ్యమైనదానిని వివరిస్తున్నారు. నవవిధభక్తులలో మొదటి రెండు స్థాయిలు శ్రవణం మరియు కీర్తనం....

త్యాగరాజస్వామి ఆ రెండింటిని కాదని, ఈ స్మరణయొక్క విశిష్టతను ఇక్కడ ఎందుకు వివరిస్తున్నారు?

భగవతుని కథలను సంగీతముతో మేళవించి శ్రవణం చేసినప్పుడు, శ్రోతల మనస్సులు భగవంతునిపై నిలుస్తాయనిఖచ్చితంగాచెప్పలేము. చాలమంది శ్రోతల దృష్టి గాయకులపైనుండి, లేదా సంగీతంపైనుండి దాటి భగవంతునిపై మనసునిలిపే స్థాయికి చేరుకోదు. ఇతరప్రాపంచిక విషయములన్నీకూడా, ఈ భాగవతకథాసంగీతసుధాశ్రవణాన్ని సజావుగా సాగనివ్వవు.

కీర్తనము చేసినప్పుడుమాత్రం, మనసును భగవంతునిపై నిలుపడానికి శ్రవణంలోకన్న ఎక్కువ అవకాశం ఉంటుంది. కానీ ఇది గాయకులు శ్రోతలను ఉద్దేశించి గానంచేసినప్పుడు, వారిదృష్టికూడా భగవంతునిపై నిలువదు. కీర్తనాస్థలములోని అనేకవిషయాలు గాయకుల ఏకాగ్రతను భగ్నం చేస్తూనేవుంటాయి. కావున కీర్తనంలోకూడా భగవంతునిపై సంపూర్ణముగా మనసును నిలుప సాధ్యం కాదు.

కావున ఈ స్మరణమును ఏకాగ్రచిత్తులై చేయడానికి, రాజయోగసాధనను సంగీతానికి జతచేయాలి.... ఇదే ప్రాపంచిక విషయబాధలను అధిగమించి, భగవంతునివైపు, రసమార్గములో మనము చేరు తొలి మజిలీ.

**అ. వర రాజ యోగ నిష్ఠులౌ**
**వారికానందమందెటట్లు (స్మ)**

ఈవిధంగా, స్థిరచిత్తులై, యోగనిష్టులై చేయువారి గానము సామాన్యస్థాయి శ్రోతలకు, రసికులకు రుచించదు. ఎందుకంటే వారికి

అద్భుత, శృంగారాది మొదటి ఎనిమిది రసములే అనుభవంలోకి వస్తాయి.

ఈ శాంతరసము వారిస్థాయికి అతీతమైనది. ఇటువంటి గానమును కేవలము రాజయోగసిద్ధులే విని అద్భుతానందమును పొందగలరు.

అయితే ఈ రాజయోగమంటే ఏమిటి? ఈ రాజయోగసిద్ధులంటే ఎవరు? అనే ప్రశ్నలు నాలో ఉదయించాయి. వీటి సమాధానాలు తెలుసుకుంటేగానీ త్యాగరాజహృదయభావం మనకు అవగతం కాదు.

రాజయోగమంటే ఏమిటి? ఈ ప్రశ్నకు సమాధానం మనకు భగవద్గీత తొమ్మిదవ అధ్యాయమైన రాజవిద్యా రాజగుహ్యాయోగములో లభిస్తుంది.

**శ్రీ భగవానువాచ :**

**సర్వభూతాని కౌంతేయ ప్రకృతిం యాంతి మామికామ్ |**
**కల్పక్షయే పునస్తాని కల్పాదౌ విసృజామ్యహమ్||**
**ప్రకృతిం స్వామవష్టభ్య విసృజామి పునః పునః |**
**భూతగ్రామిమం కృత్స్నమ్ అవశం ప్రకృతేర్వశాత్ ||**

అంటే ఈ సమస్తసృష్టి అంతమున పరమాత్మయొక్క ఆదిమమైన ప్రకృతిశక్తియందు విలీనమౌతాయి. పిదప సృష్ట్యాదిలో పరమాత్మ, ప్రకృతికి లోబడిన ఈ ప్రాణులన్నింటినీ, వాటికి అతీతమైన తన మాయతో తిరిగి సృష్టిస్తాడు.

ఇది చెప్పడం ఎంత సులభమో, అర్థం చేసుకోవడం అంత కఠినము. పరమయోగులకు, "ఐన్ స్టీన్" వంటి అతివిశిష్టవైజ్ఞానికులకు మాత్రమే ఇది సాధ్యమయినది.

అటువంటి మహాజ్ఞానులే పరమాత్మయొక్క లీలవిలాసములను, కేవలం భగవంతుని స్మరణముతోనే తెలుసుకొనగలరు. అదియే వారి జ్ఞానమునకూ, భక్తికీ, పరమాత్మునిపై వారు పెంచుకొను అనురాగమునకూ పరాకాష్ట.

ఈ కృతి అనుపల్లవిలో, అటువంటి పరమాత్మ స్మరణలోని అనంతమైన ఆనందాన్ని తాను స్వయంగా అనుభవిస్తూ, సర్వమానవాళికీ అదియే ధ్యేయమని త్యాగరాజస్వామి బోధిస్తున్నారు.

చ. **రామ నామ (శ్రవణము) స్మరణము వల్ల నామ రూపమే హృదయము నిండి ప్రేమ పుట్ట సేయగ లేదా నిష్కామ త్యాగరాజు సేయు నామ (స్మ)**

సాధారణంగా సంగీతవిద్వాంసులు ఈ చరణంలో "రామనామశ్రవణము వల్లనే" అని గానంచేస్తున్నారన్నది మనకు సుపరిచితమే....

కానీ ఈ కృతి పల్లవినీ, అనుపల్లవినీ పరిశీలిస్తే, త్యాగరాజస్వామి ఈ కృతిలో రామనామ 'స్మరణము' యొక్క విశిష్టతను వివరిస్తున్నారన్నది సాహిత్యము, త్యాగరాజహృదయభావము తెలిసినవారికి ఎవరికైనా తేటతెల్లమౌతుంది...

కాని తెలుగుభాష సరిగ్గా తెలియని సంగీత విద్వాంసులెవరో ఇక్కడ 'స్మరణము'ను 'శ్రవణము'గా మార్చియుంటారని నా ప్రగాఢ విశ్వాసము....

ఈవిధంగా ఇక్కడ శ్రవణముయొక్క విశిష్టతను వివరించడం తార్కికంగా విశ్లేషిస్తే, అసందర్భంగానూ, అనుచితంగాను తోచకమానదు.

కావున త్యాగరాజస్వామిపై భక్తితో, కృతిలోని భావం దెబ్బతినరాదని భావిస్తూ, ఈ చరణంలో 'శ్రవణము'ను 'స్మరణము'గా మార్చే సాహసం చేస్తున్నాను....

రసహృదయులైన సంగీతజ్ఞులు, నా యీ సూచనను ఆదరింతురుగాక....

అయితే ఇటువంటి స్మరణచేయడంవలన మనకు కలిగే ప్రయోజనమేమిటి? అనే విషయాన్ని వివరిస్తున్నారు త్యాగరాజస్వామి.

ఈ శుద్ధాంతఃకరణముతో స్మరణచేసే స్థితిని చేరుకున్నప్పుడు, సర్వమానవులూ, సర్వప్రాణులూ, సకలచరాచరసృష్టియంతా పరమాత్మలీలావిలాసమనే జ్ఞానంకలిగి వాటన్నింటియందూ సమభావమైన ప్రేమ ఏర్పడుతుంది.

ఇటువంటి ప్రేమమాత్రమే మనలోని వ్యక్తిగతమైన కామక్రోధాది షడ్రిపులను నిర్జించి, మనను పరమాత్మను చేరుటకు జ్ఞాన, భక్తి, రసమార్గోన్ముఖులను చేస్తుంది.

ఇది విజ్ఞానశాస్త్రపరంగా చెప్పాలంటే, ఒక రాకెట్టు భూమ్యాకర్షణశక్తిని అధిగమించి విశాలవిశ్వంలోకి అడుగుపెట్టాలంటే దానికి తగినంత ఇంధనం కావాలి. అప్పుడే ఆ రాకెట్టు తన అనంతవిశ్వయానం మొదలుపెట్టినట్లే. అప్పుడే అది ఇతర నక్షత్రములనూ, పాలపుంతలనూ చేరుకొని విశ్వదర్శనయోగ్యత సాధిస్తుంది.

అటువంటి పరమాత్మ సందర్శనానికి కావలిసిన విశిష్టమైన ఇంధనమే ఈ "నిష్కామప్రేమ" అనే ఒక అద్భుతమంత్రమును బోధిస్తున్నారు త్యాగరాజస్వామి ఈ కృతిలో.

ఆయన రచించిన "పరమాత్ముడు వెలిగే" కృతిలో అద్భుతరస, శాంతరస సమ్మేళనమును మనము దర్శించగలము.

కాని ఈ "స్మరణే సుఖము" కృతిలో మనము సంగీతసాహిత్యములనే తెరలను చీల్చి చూడగలిగితే, శుద్ధమైన, పరిపూర్ణమైన శాంతరసానుభవము పొందగలము.

ఈ శుద్ధశాంతరసానుభవం కలగాలంటే ఈ కృతిలోని దృతగతి సంగతులను, లెక్కలను, అనవసర రాగప్రస్తారములనూ విడనాడి చౌకకాలంలో, కేవలం కృతిపై త్యాగరాజహృదయభావముపై దృష్టినిలిపి, పాడాలి / వాయించాలి.

అప్పుడే సంగీతకళానిధులైన గాయకులకూ, విశిష్ట శ్రోతలకూ, రసికాగ్రేసరులకూ, రాజయోగసిద్ధులకూ ఒక విశిష్టమైన అలౌకికానందం కలిగి వారు ధన్యులౌతారు.

సంగీతానికి పరమావధి ఇదే...

శుభమ్ భూయాత్....

# మన క్షేత్రయ్య – కథాకమామిషు

ప్రొ. విస్సా అప్పారావు

పదరచయిత క్షేత్రజ్ఞుడు గురించిన జీవిత విశేషాలు కొన్ని కథనాలద్వారా, చారిత్రాకాంశాలద్వారా మాత్రమే తెలుసుకునే అవకాశం మనకు లభిస్తున్నది. వాటిగురించి క్లుప్తంగా చూద్దాం.

1. సుబ్బరాయ దీక్షితార్ వారి ''సంగీత సాంప్రదాయ ప్రదర్శిని'' ప్రకారం క్షేత్రజ్ఞుడు తన యవ్వనదశలో ఒక యోగి పుంగవుని ద్వారా గోపాల మూలమంత్రోపదేశం పొంది, ఆ మంత్రాన్ని నిష్ఠగా జపించినట్లు, కొద్దికాలం తర్వాత గోపాలదేవుని ఆశీర్వచనం వల్ల క్షేత్రజ్ఞుడు మువ్వగోపాలుని స్తుతిస్తూ, పదరచన చేసి పాడుకుంటున్నట్లు వాటిలో మొదటిరచన ''**శ్రీపతి సుతుబారికి నేనోపలేక నిను వేడితే కోపాలా? మువ్వగోపాలా**'' అనేది. కాలక్రమాన మువ్వగోపాలునిపై వేల పదాలను వ్రాసిన క్షేత్రజ్ఞుడు అనేక రాజుల, నవాబుల దర్బారులను, పుణ్యక్షేత్రాలను తిరుగుతూ క్షేత్రజ్ఞుడనే పేరుపొందాడు.

2. శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారి కథనం మరోలా వుంది. క్షేత్రజ్ఞుడు విటరాయుడు. తంజావూరు తదితర ప్రాంత రాజుల, నవాబుల దర్బారులో తిరుగుతూ పదరచన చేస్తుండేవాడు. అలా కొద్దికాలం గడిచిన పిదప తన స్వగ్రామమైన మువ్వ గ్రామానికి తిరిగి వచ్చాడు. ఆ గ్రామపు గోపాల స్వామి దేవాలయంలో నవయవ్వనవతియైన దేవదాసి పట్ల ఆకర్షితుడయ్యాడు. ఆమె అతనిని తిరస్కరిస్తూ ''నా దైవం గోపాలదేవుడు, నీవింతకాలం ప్రభువుల స్తుతిస్తూ బ్రతికావు, రచనలు చేశావు. ఆ భగవంతుని ఎప్పుడూ స్తుతించిన పాపాన పోలేదు. నీవు గానీ నా ప్రభువైన మువ్వగోపాలుని స్తుతిస్తూ నీ మనస్సును ఆయనపై లగ్నం చేసిననాడు మన ఆలోచనలు ఒక్కటి కావచ్చునేమో'' అన్నది. క్షేత్రయ్య పట్టుదలగా నిద్ర ఆహార పానీయాలను కూడా తీసుకోకుండా త్రికరణశుద్ధిగా గోపాలదేవుని ధ్యానిస్తూ కాలం గడపడం మొదలుపెట్టాడు, చివరకు గోపాలదేవుడు కరుణించి, కనిపించాడు. దాంతో గోపాలునిపై పదరచనారంభం అయింది. క్షేత్రయ్య మనోవాక్కాయ కర్మణా గోపాలదేవుని ఆరాధించే ధోరణిలో పడ్డాడు. దేవదాసితో కలిసి మువ్వ వీధుల వెంట, దేవాలయంలో భగవంతుని ముంగిట పదగాన నాట్యాభినయాలతో వారి రోజు గడిచేది, అచిరకాలలోనే క్షేత్రజ్ఞుడు మువ్వనువదిలి, తీర్థయాత్రాభిముఖుడయ్యాడు. అంతకన్నా కథల ద్వారాఅందిన సమాచార మేమీ లేదు.

సాంప్రదాయంగా మువ్వ గ్రామవాసులు తమకు అందిన సమాచారాన్ని నాకు ఇలా అందించారు. ''ఇక్కడ గోపాలస్వామి దేవళం చాలా పురాతనమైనది. ప్రస్తుతం మనముందున్న నిర్మాణం ఆమధ్యకాలంలో బాగు చేతలకు నోచుకున్న రూపం. మువ్వ – కూచిపూడి గ్రామల మధ్య ఓశివారు ప్రాంతం

సానెంపాడు అనబడే సానిపేట. దేవదాసీ స్త్రీలు ఇక్కడ నివసిస్తుంటారు. ఓ వంద ఏండ్ల క్రితమే ఈ గ్రామం మాయమయ్యింది. ఒకప్పుడు ఇక్కడో వూరు ఉందనే ఆనవాళ్ళు మాత్రం నేటికీ కనబడుతున్నాయి.

క్షేత్రయ్య అసలు పేరు మువ్వవరదయ్య, నిరక్షరాశ్యుడు - పశువులకాపరి. తరచు ఆ గ్రామాన వెలసిన గోపాలుని దర్శించుకునే మూఢ భక్తుడు. కొందరి దృష్టిలో ఆ వూరి దేవదాసీల అమ్మాయి, మరికొందరి కథనంలో ఆ వూరి గొల్ల పిల్ల - గోపాలదేవుని భక్తురాలు అయిన దానిని ప్రేమించాడువరదయ్య. ఆమె తిరస్కరణకు గురయ్యాడు చదువురాని వాడనే కారణంగా. మనస్సు కలుక్కుమని దీక్షగా, మూఢంగా గోపాల దేవుని స్మరణలో ఏకబడిని ఎన్నోరోజులు గడిపేసాడు. గోపాలదేవుని కృపా కటాక్ష వీక్షణఫలమేమో అన్నట్లుగా ఆశువుగా మువ్వ గోపాలా! అంటూ పదరచన ఆరంభించాడు. పరమ భక్తుడుగా మరో రూపందాల్చినట్లగా వరదయ్య ప్రవర్తన మారిపోయింది. ఆ యవ్వనవతి పట్ల కూడా వరదయ్య ఆలోచనలు మారాయి. ఇద్దరూ కలిసి భక్తులై వరదయ్య రచనల గానం చేస్తూ, అభినయిస్తూ, ఆనందిస్తూ కాలం గడపనారంభించారు. గ్రామమంతా వరదయ్య అభినివేశాన్ని గుర్తించనారంభించింది, కొద్ది కాలం తర్వాత వరదయ్య తంజావూరు ప్రాంతాలవైపు వలసిపోయి అనేక క్షేత్రాలను దర్శిస్తూ, ఆ క్షేత్రపాలకులను స్తుతిస్తూ రచనలు చేసాడని, అందుకే వరదయ్య కాస్తా క్షేత్రయ్య అని పిలువబడ్డాడని చెబుతుంటారు. అతనుమాత్రం మువ్వకు తిరిగిరాలేదు. ఇంతకు మించి ఆ గ్రామ పెద్దలకూ తెలిసిందిలేదు.

వివిధ మార్గాల ద్వారా ఈ సమాచారం కూడా ప్రచారంలోవుంది.

1. ఆయన అసలు పేరు 'మువ్వవరదయ్య' – చాలకాలం ఈ పేరు తెలియరాలేదు.

2. బాల్యం మువ్వలో గడిపినా పదరచన మొదలు పెట్టిన అనంతరం – తంజావూరు ప్రాంతాలకు వెళ్ళిన వరదయ్య 'మువ్వ'కు తిరిగి రాలేదు.

3. భక్తురాలైన ఓ దేవదాసి కన్యతో వరదయ్య పరిచయం – గోపాల భక్తునిగా మార్చింది. ఆమెపై అతనికి గల అభిప్రాయం మారింది. అతని జీవితగమనాన్నే మార్చింది.

కవి కాళిదాసు జీవితంలో అమ్మవారి దర్శనం పండితునిగా మార్చినట్టు నిరక్షరాస్యుడైన వరదయ్య జీవితంలోనూ ఓ ఘట్టం గొప్ప వాగ్గేయకారునిగా, సంగీతజ్ఞునిగా, భక్తునిగా మార్చడం గమనార్హం. చరిత్రలో ఇలాంటి కథలు ఓ గొప్ప వ్యక్తి ఆవిర్భావానికి దారితీస్తాయి అనే కథనాలలో ఇది ఒకటి.

వరదయ్య గొప్పకుటుంబీకుడయి ఉండవచ్చు. చదువురాకపోవడం, చదువు మీద దృష్టిలేకపోవడం వేరే విషయం. కృష్ణానదీతీరాన ఓ గొప్ప సంస్కృతీ సాంప్రదాయాలకు నెలవైన చోట, ప్రాచీనమైన చోట అతని జీవనం సాగిందన్నది దృష్టిలో పెట్టుకోవాలి.

ప్రఖ్యాతుడైన ఆంధ్ర విష్ణువునెలకొన్న శ్రీకాకుళం, ఆ ప్రక్కనే ఘం(గం)టసాల రెండూ

మువ్వకు సమీప ప్రాంతాలే! వేల సంవత్సరాల చరిత్రను ప్రోది చేసుకొన్నవే! 'కూచిపూడి' 15 వ శతాబ్దికి ముందే ప్రఖ్యాతమైనది. సంగీతానికి, అలంకార శాస్త్రానికి, అభినయానికి, నాట్యానికి, నాటకానికి మరీ ముఖ్యంగా "పారిజాత" రూపకానికి. మువ్వకు అతిదగ్గరలోనే వుంది.

ఈ నేపథ్యంలో వరదయ్య ఉత్తర రంగంలో నైనా వీటన్నింటిలోను సాధికారిత కల్గిన పరిచయం ఏర్పరచుకొన్నవాడే గురుకులవాస పద్ధతిలో..

ఆయన పదరచనలో ఈ శాస్త్రవిషయాలన్నీ సాక్షీభూతాలుగా నిలిచి మనకు కనపడతాయి... సాధికారంగా. ఆయన తోటి విద్యార్థులలో ఎన్నదగ్గ శిష్యునిగా ముద్ర వేయించుకొన్నవాడే అయివుండితీరాలి. ఆ విద్యార్జనా సమయంలో ఆ ప్రాంతంలోని దేవదాసీ యువతులు కూడా ఈ శాస్త్ర విషయాలను నేర్చుకొంటున్నవారై, వరదయ్య సమకాలీనులై వుండి వుండాలి. ఈ పరిచయం అలాంటిదే!

వంశవృత్తి కావడం వల్ల ప్రతిభావంతులైన ఆ దేవదాసీ కన్యలు తెలుగు, సంస్కృతం, అలంకార శాస్త్రాలను అభ్యసించి వుండాలి. వరదయ్యకు ఈ పరిచయం ఓ ప్రతిభామూర్తితో మరింత దగ్గర చేసి వుండొచ్చు. ఈ కోణంలో ఆలోచించి అతని రచనలలోని గూఢతను గుర్తించే పనిలో పడ్డాను. మువ్వలో అతని జీవితపు మలిదశలను చూడాలనే ఉత్సుకతతో....

"నన్నే పెండ్లాడు సుమీ" అనే పదరచనలో ప్రేయసి ప్రియునితో ఇలా అంటూ "మనపెళ్లికి నా పెద్దలు నీ దగ్గర్నుంచి 'వరాలు' (వరహాలు) బంగారు కాసులు ఎక్కువ అడగకుండా చూస్తానని ఆ కాలపు ఆనవాయితీని చెప్పడం కనిపిస్తుంది.

ఇంకా ఇందులో వారి ప్రేమాయణంలో వారెంత దగ్గరయిందీ, ప్రియుడు ఏమేమి చేసిందీ ఎలా ముద్దులాడినదీ, యేమేమి బాసలు చేసినదీ, ఎంత లోతుగా వారు ప్రేమించుకొన్నదీ సవివరంగా వ్రాయబడింది.

ఈ ప్రేమ వ్యవహారంలో వరదయ్య ఎదుర్కొన్న చిక్కులు, పెద్దల నుండి తండ్రి నుండి, బంధువులనుండి కలిగిన ఆటంకాలు, కోపతాపాలు విశదమవుతాయి.

చివరకు వరదయ్య ఆమెను భార్యగా చేసుకొంటాడు. "పిలవనంపె నన్నీవేళ" పదంలో కష్టాలన్నింటినీ ఎదుర్కొన్న దేవదాసీ ప్రియురాలి మనోభావాలు కనిపిస్తాయి, వరదయ్యనుండి కలవడానికి కబురందుకొన్నవేళ.

వరదయ్య దృష్టిలో ఉదాత్తవనిత మనోరీతులు "సామాన్యముగాదె" పదంలో ప్రస్ఫుటమవుతాయి. ఈ లక్షణాలన్నీ గత కొన్నేళ్లుగా కలసి తిరుగుతున్న ఆమెలో చూచాడు. యవ్వనం – అందం – సంస్కారం కలగలిపిన రూపం ఆమెది. అందుకే కులం – జాతి – ఆచారం – వగైరా అడ్డంకులను దాటుకొని ఆమె ప్రత్యేకమైనదని గుర్తించి తన దానిని చేసుకొన్నాడు.

ఈ యవ్వనపు జంట కొద్ది కాలం వారి జీవితాలను మనఃపూర్వకంగా అనుభవించేవుండాలి. మువ్వగోపాలుని నిత్యదర్శనంలో, ఆరాధనలో

పునీతులయివుండాలి. ఓ భాగ్యమైన క్షణంలో ఆ దర్శనానందంలో గోపాలమూర్తిని స్తుతిస్తూ ఆశువుగా ఓ కవితాధార జాలువారివుండాలి– మువ్వగోపాలాంకితంగా. ఈ పదరచనలో వరదయ్యభార్య ప్రోద్బలం నిండార వుండివుండాలి. ఆహారం – నీరు – నిద్ర వదలి ఆగుడిలో గోపాలస్మరణంతో తపోనిష్టలో వున్న వరదయ్య ఆక్రోశం గోపాల దేవుని అంకితంగా పాటగా బయలువెడలివుండాలి. సాంప్రదాయంగా అందివస్తున్న క్షేత్రయ్య కథలు ఇలానే చెబుతున్నాయి.

ఈ పదం క్షేత్రయ్య మొదటి రచన అని లోకోక్తి.

**'శ్రీపతి సుతుబారికి నేనోపలేక నినువేడితే**

**కోపాలా! మువ్వగోపాలా?'**

ఆనందభైరవి రాగం ఆదితాళం లో వుంది.

మొదటికృతి ''శ్రీ'' తో ఆరంభం కావడం సాంప్రదాయమూ, కవితా రీతీ కావడం గమనించ వచ్చు.

మరో విషయం – మిగతా పదాలంతా నాలుగు పాదాలతో మూడు చరణాలు, పల్లవి, అనుపల్లవి నిబంధనతో సాగినా ఆయన మిగతా రచనలకు భిన్నంగా, అయిదు చరణాలకు ఒకే పాదంతో వుండడం అనేది. ఇది, ఆయన మొదటి రచన అయి వుంటుందనే వాదనకు బలం చేకూరుస్తున్నది.

వరదయ్యకు అంటిన ఈ కొత్త వ్యాపకంలో వారిద్దరూ రోజూ ఇదే పనిగా రచనలు చేస్తూ గానం చేస్తూ మధురానుభూతిని అనుభవిస్తూ వుండి వుండవచ్చు. జయదేవుని రచనకు పద్మావతి అభినయం పట్టినట్లుగా వరదయ్య రచనలలోని భావాలకు శ్రీమతి అభినయాల రంగు పూసి మరింత రసమయం చేసి వుండవచ్చు.

ఈ అనుభవాల సారం వారి జీవిత గమనంలో లౌకికాల నుండి దూరం చేసి అలౌకికానందం వైపు, ఆ పుంసాం మోహనరూపుని పై ఆపేక్ష వైపు మరలించి మువ్వనుంచి యాత్రాగమనుని చేసి వుండవచ్చు. ఈ క్రమంలోనే వారి ప్రఖ్యాతిని విని ఆ స్థానాలలోను వారి సభలు జరిపించివుండవచ్చు.

తంజావూరు రఘునాథ నాయకుని కొలువులో క్షేత్రయ్య ప్రవేశం గురించిన ఆధారాలు లభిస్తున్నాయి. ''వెదుకటో నడచుకొన్న'' పదం – ఆ తర్వాత ఈ యాత్రలవలన లభించిన 'క్షేత్రజ్ఞ' పేరు – తంజావూరు, మధుర, గోల్కొండ దర్బారులలో వ్రాసి పాడిన సుమారు నాలుగువేల పదములు. ఇదీ చరిత్ర.

ఈ పదంలో సూచ్యంగా లభించిన విషయం గోల్కొండ దర్బారులో ''తులసి మూర్తి'' తో స్పర్థతో 50 రోజుల్లో మువ్వగోపాలుని కృపవల్ల 1500 పదరచనలు చేసి గెలవడం. అయితే ఈ రచనలన్నీ మువ్వగోపాలదేవునిమీద తప్ప ఆ స్థానాధీశ్వరులమీద కాకపోవడం గుర్తించాలి. వరశాలి కాబట్టే ఇంత తక్కువ సమయంలో ఇన్ని పదాలను వ్రాయగలిగాడు.

ఈ సందర్భంలో మరో అంశం కూడా గమనించాలి. విజయరాఘవునిపై కొన్ని, గోల్కొండ శిరస్థదారుడైన తుపాకుల కృష్ణపై కొన్ని రచనలు పూర్వరంగంలో చేసినట్లుగా తెలుస్తున్నది.

1630 ఏ.డి.లో తంజావూరు దర్బారు

ప్రవేశించినట్లు, అది రఘునాథ నాయకుని చివరిదశ అని అంటే అంతకుముందుగానే వరదయ్య జన్మించివుండాలి.

ఆయన రచనలు అచ్చయి అందిన ప్రకారం క్షేత్రయ్య దాదాపు పద్దెనిమిది పుణ్య క్షేత్రాలను దర్శించినట్లు తెలుస్తున్నది. ఒకటి నుండి నాలుగు పదాలు ఆయా క్షేత్ర స్వామిపై రచించి అందించారు. ప్రతి రచనలోను ఆ స్వామిని ప్రస్తావించినా మువ్వగోపాలునిగా కల్పనచేసి ''మువ్వగోపాల'' ముద్రతోనే ముగించారు.

ఈ క్షేత్రాలలో వరహూరు, చిదంబరం, కడప, కంచి, హేమాద్రి, యదుగిరి, పాలగిరి, తిరుమల, తిరువళ్ళూరు, శ్రీరంగం, మధుర, సత్యపురి, ఐనాపురి, శ్రీశైలం మరికొన్ని గుర్తింపబడనివీ వున్నాయి.

కంచివరదరాజస్వామిపై పదిహేనుకు పైన పదాలుండగా ఇతర దైవతాలమీద ఆ సంఖ్య నాలుగుకు మించలేదు. కంచివరదునిపై ఇంత అభిమానానికి కారణం తనపేరు వరదయ్యకావడమే అని నాకనిపించింది.

ఈ పదిహేను రచనలను వేరు చేసి పెట్టి అందలి సాహిత్యమును గమనిస్తూ ఓ క్రమంలో వ్రాసుకొని చూసినపుడు మువ్వలోను, మువ్వను వదలి వెళ్ళిన వరదయ్య జీవిత ఘట్టాలన్నీ, విశేషాలన్నీ క్రమబద్ధీకరించి స్వామికి చెప్పుకొన్నట్లుగా అనిపించింది.

'ఊరికిపోక' పదరచన సమయంలో వరదయ్య కంచిలోవున్నారు. మువ్వనుండి తిన్నగా కంచికి చేరారు. అక్కడే చెప్పదగ్గ కాలం ఆవాసం చేశారు. ''చక్కనిదయ'' పదం వరదయ్య ప్రేయసి కంచిలో వారిని కలవడం, ఆ తర్వాతి సంగతులు వివరిస్తుంది.

ఆ తర్వాత?! వారిద్దరు కంచిలో కాపురమున్నారా!? సమాధానం కాదనే చెప్పాలి? అలౌకికానందంలోని అనుభవం గుర్తెరిగిన క్షేత్రయ్య ఆమెకు నచ్చ చెప్పి 'ఇది కాదు జీవితమని' ఉపదేశించి మువ్వకు తిరిగి పంపాడు. ఆమెకూడా విషయగ్రహణ ధురీణ కావడంతో మువ్వగోపాలుని భక్తురాలుగా మువ్వలోనే జీవితం ముగించ సిద్ధపడింది.

మరి క్షేత్రయ్య? ఆ తర్వాత ఏమయింది అతని జీవితం? చరిత్రదీనికి సమాధానం ఇచ్చింది. విజయరాఘవుని కొలువులో చిరకాలం వున్నట్లు. విజయరాఘవుడు పోషించినట్లు. ఈర్ష్యాసూయల సాటికవుల బండారం బయట పెట్టడానికన్నట్లుగా ఓ పదాన్ని కొన్ని చరణాలు మాత్రమే వ్రాసి పూరించమని అందించినట్లు, తాను సేతు యాత్రకు వెళ్ళవచ్చిన దాకా సరియైన పూరణదొరకక రాజు క్షేత్రయ్యనే పూరించమన్నట్లు, క్షేత్రయ్య అర్థవంతమైన పూరణ అందించినట్లు కవుల గర్వమడచినట్లు.

వరదయ్య పేరు మరుగున పడి చరిత్రలో క్షేత్రజ్ఞ (ఆంధ్రుల క్షేత్రయ్య) అన్నపేరు మిగిలినట్లు. భగవద్గీత పదమూడవ అధ్యాయం క్షేత్రయ్య అనే పదానికి ఆధ్యాత్మిక పరిజ్ఞాతుడనే అర్థం చెప్తుంది. నిజానికి క్షేత్రయ్య అంతటి జ్ఞాని అయ్యాడని విశ్వసిద్దాం!

★ ★ ★

**(మద్రాసు మ్యూజిక్ అకాడమీలో ప్రొఫెసర్ విస్సా అప్పారావు గారి ఆంగ్లోపన్యాసంకు తెలుగు సేత)**

# "భక్తి వివిధ అంశాల సమన్వయ విశ్లేషణ"

డా. సి. ఉమాప్రసాద్, హైదరాబాద్
సెల్ నెం : 7032725616

భగవత్కీర్తనమ్ 'భక్తి' అనివ్యవహరించడం తమిళదేశంలోని ఆళ్వార్లు, నయనార్ల వల్ల ప్రాచుర్యం వహించింది అని చెప్పవచ్చు.

భగవంతుడిని ఊహించి అతడితో తమ భావాలు పంచుకోవడానికి భక్త కవులు ప్రయత్నించారు అని చెప్పవచ్చు.

'భక్తి' అంటె భగవంతుడినీ అర్చించడమనే పరిమితమైన అర్థంగా గాక ప్రేమ స్వరూపమైన భగవంతునిలో సంలీనమవడమనే అర్థం స్థిరపడింది అని చెప్పవచ్చు.

ఆలంకారికులు 'రసంగా' నిరూపించారు. ఆధునిక కాలంలో సామాజిక శాస్త్రవేత్తలు భక్తి ఉపయోగితా గుణాన్ని పరిగణలోకి తీసుకుని దాని వర్గ ప్రయోజనాన్ని చర్చించారు.

నారద భక్తి సూత్రాలలో భగవంతుని యందు పరమ ప్రేమ కలిగివుండడం. శుద్ధ ఆత్మ స్వరూపం అవిచ్ఛిన్నమైన ఆత్మరతిని ఊహించడమే 'భక్తి' అన్న వివరణ ఉంది.

శాండిల్య భక్తి సూత్రాలలోను భగవంతుని యందు అనురక్తి కలిగి వుండడమే 'భక్తి' అని చెప్పబడింది.

వైష్ణవ మత ప్రచారకుడైన రామానుజుడు ప్రేమపూర్వకంగా నిరంతరం భగవంతుడిని ధ్యానించడమే 'భక్తి' అని వేదాంత దేశికులు అత్యున్నత ప్రేమస్వరూపమే పరమ భక్తి అని చెప్పారు.

సాధారణంగా భక్తిని రతితో పోలుస్తువుంటారు.

బృందారణ్యకోపనిషత్తులో

**''యథా ప్రియాయా స్త్రియా సంపరిష్వక్తా సబాహ్యం కిం చనవేద**

**అంతరం, తద్వా అస్య ఏతదాప్తకామం; ఆత్మకామ మకామంరూపం శోకాంతరమ్**

(బృ.ఉపనిషత్తు 4,3,చ)

ప్రియురాలి పరిష్వంగంలో ప్రియునికి బాహ్యజ్ఞానం, అంతర జ్ఞానం నశించి పోయినట్లు భగవత్ పరిష్వంగంతో జీవుడికి బాహ్యంతర జ్ఞానం వుండదు. దానివలన ఆతడు ఆప్తకాముడు. తీరిన కోరిక గలవాడు అవుతాడు. పరమాత్మ అతని కామం. ఆ దేశంలో అతనికి ఏ కామం ఉండదు. ఏ శోకం ఉండదు. భక్తిమార్గం అనుసరించిన పలువురు కవులు శృంగారాన్ని పోషించడం, అన్నమయ్య లాంటి భక్తులు భగవద్రతిని కీర్తిస్తూ వేల సంకీర్తనలు రచించడం భగవంతుని పట్ల భక్తికి, శృంగారానికీ అభేదాన్ని ప్రతిపాదిస్తున్నారా అనిపించకపోదు.

సోమనాథుడు కూడా 'అనుభవసారం'లో భక్తుడైన వ్యక్తి చిత్తవృత్తిని గూర్చి ఇలా వివరించాడు.

**''కామంబు భక్తిరతి యెడ**

**దామతి క్రోధంబు దేహధర్మముల యెడన్**

**వ్యామోహము భక్తుల యెడ**

**శ్రీమతి లోభంబు వలయు శివపూజ యెడన్**

(పద్యం – 59)

భక్తునికి భగవంతుని పట్ల అనురక్తి, ఆత్మరతి ఉండడంతో నిరంతరం ధ్యానించి దేవుడి దయకు పాత్రమవ్వాలని ఆశిస్తాడు. భక్తుడైన వ్యక్తి తన ప్రత్యేకతను, అస్తిత్వాన్ని సంపూర్ణంగా త్యజించి తనను భగవంతునికి సమర్పించుకోవాలనీ కోరుకోవడమే 'భక్తి'. తదేకంగా ధ్యానించే సందర్భంలో భక్తునిలో కలిగే వివిధ మానసిక చిత్తస్థితులను గుర్తించిన అలంకారికులు ''భక్తి'' ని రసంగా నిరూపించారు.

అలంకారికుల దృష్టిలో భక్తి రూపగోస్వామి మొట్ట మొదటగా చెప్పుకునే అలంకారికుడు. చైతన్యుడి వైష్ణవోద్యమ ప్రభావంతో భక్తిని ప్రత్యేకంగా అధ్యయనం చేసి ''భక్తి రసామృత సింధువు'' ఉజ్జ్వల నీలమణి రచించారు.

భక్తి రసానికి స్థాయి భావం – మధురతి. శ్రీ కృష్ణుడు అలా తన భక్తులందించిన శృంగారానుభూతి దోషంగా పరిగణించడానికి వీలులేదు అన్నారు. లీలావిలసనంలో భాగము మాత్రమే అంటారు.

అలాగే 'మధుసూదన సరస్వతి' తన భక్తి రసాయనంలో భగవద్గుణ శ్రవణం ద్వారా మనోవృత్తులు ఉద్దీపిత మైనపుడు భగవదాకారంతో సంలీనం అయ్యే చిత్త వృత్తిని 'భక్తి' అని పిలిచాడు. భగవద్గీతలో అర్జునుడికి కృష్ణుడు యుద్ధం చేయవలసినప్పుడు కర్తవ్యాన్ని తెలియజేస్తూ శత్రువీరులను తానే సంహరిస్తానని, అర్జునుడు నిమిత్తమాత్రుడని తెలిపి తన విశ్వరూపాన్ని ప్రదర్శిస్తాడు. ఆ సందర్భంలో భయకంపితుడైన అర్జునుడు

**''రూపం మహత్తేం బహువక్త్రనేత్ర**

**దృష్ట్వా లోకాః ప్రవ్యథితాస్తథాహమ్''**

(భగవద్గీత 11–23)

పండితారాధ్యుడు భక్తిని రసంగా భావించలేదు. కాని, అతని అనుయాయి అయిన పాల్కురికి సోమనాథుడు 'భక్తి'ని రసంగా భావించాడు.

కన్నడ దేశంలో వీరశైవభక్తిని ప్రచారం చేసిన కవులు భక్తిని సాహిత్య అంశంగా గానీ, అలంకార సిద్ధాంతాలను అధ్యయనం చేసి భక్తిని రసంగా గాని, నిరూపించలేదు. ప్రత్యక్షజీవితంలో సంఘటనలకు వచన రూపమిచ్చి భావాలు ప్రచారం చేశారు. సోమనాథుడు సాహిత్య రచనకి ప్రాధాన్యత ఇచ్చాడు.

అన్నమయ్య దృష్టిలో ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందడం, మధుర భక్తిని ప్రచారం చేయడం సామాజిక అంశాలను భగవంతునికి నివేదించుకోవడమే ''భక్తి'' అని చెప్పారు.

**సామాజిక శాస్త్రవేత్తల దృష్టిలో భక్తి :**

భక్తిని అధ్యయనం చేసిన తొలి చారిత్రికుడు డి.డి. కోశాంబి. ఆయన భగవద్గీతలోని సాంఘిక ఆర్థిక అంశాలను పరిశీలిస్తూ 'భక్తి' మధ్య యుగాలలో భూస్వాములకు అత్యంత విశ్వాసంగా, అణకువగా ఉండడానికి ఉపయోగితమైన సిద్ధాంతంగా పరిగణించాడు. (డి.డి. కోశాంబీ The culture and civilization of Anicent India p.208)

భగవంతుడు ఎటువంటి వ్యక్తిత్వం కలిగి ఉన్నా అతనిని ప్రశ్నించని రీతిలోనే భూస్వాములు ఎటువంటి వారైనా వారి వ్యక్తిత్వాన్ని సంపూర్ణంగా

అంగీకరించడానికి ''భక్తి'' ఉపయుక్తమయిందనీ భావించాడు. ఆర్.ఎస్. శర్మ భక్తుడు సంపూర్ణంగా భగవంతునిపై ఆధారపడినట్లుగానే కౌలుదారు భూస్వామిపై ఆధారపడడానికి 'భక్తి' ఉపకరించిందని అంటారు.

ఆర్.ఎన్. నంద – మఠాలు, దేవాలయాలు భక్తిని ప్రచారం చేయడమంటే ప్రభువులకు, భూస్వాములకు సేవాదృక్పథంలో ఉండి వారి వ్యావసాయక ఉత్పత్తులను పెంపొందించుకోవడానికేనని భావించాడు.

(R.N. Nandi – Social roots of Religion in Anicent India p.96)

మరికొంతమంది అభిప్రాయంలో 'భక్తి' ఆచారణాత్మకంగా నిర్వహించిన పాత్ర కంటె అది కలిగించిన భ్రాంతి అధికం.

చాలా మంది భక్తి ఉద్యమం నిర్వహించిన పాత్రను ఆ ఉద్యమ నేపథ్యంలో తెలుగు భక్తి కవిత్వాన్ని అధ్యయనం చేయడం ద్వారా అనేక విశేష అంశాలు కూడా స్పష్టమవుతాయి.

## నివాళి



ప్రముఖ గాయని, సంగీత కర్త, A Grade Composer జానపదాలకి చిరునామా, రచయిత్రి, Studio Owner **శ్రీమతి స్నేహలతామురళి** గారు ది.11.11.2023 ఆకస్మికంగా మరణించారు.

గానకళా లోకం వారికి సంతాపం తెలియచేస్తున్నది.

# మార్గళి మహోత్సవం డిసెంబరు నెల చెన్నై నగరం!

- మోదుమూడి సుధాకర్

మార్గళి మహోత్సవం డిసెంబరు నెలలో ఆ నగరం వెలిగిపోతుంది. ఏదో చైతన్యం ప్రతి వీధిలోనూ నడయాడుతుంది. మధుర నాదం ప్రతిచోటా ప్రతిధ్వనిస్తుంది. కర్ణాటక సంగీత ప్రియులకు దివ్యధామం... చెన్నై నగరం!

దాదాపు నెలరోజులపాటు ఒకేసారి యాభైకి పైగా సభలు నిర్వహించే కచేరీల పరంపర..

వివిధదేశాల సంగీత ప్రతినిధులకు ఆహ్వానం పలుకుతుంది ఆనగరం! 'మార్గళి' పేరిట ఏటా జరిగే సంగీతోత్సవమది!వందేళ్ల పైబడిన సంప్రదాయమది!.. సినిమా కోసం నుంచున్నట్లు క్యూలలో నుంచుంటారు అక్కడి జనం,సంగీత సభలముందు టిక్కెట్లకోసం!..

గూడకట్టు పంచె కట్టి, నుదుటి విభూతిరేఖలతో, చేతిలోని హిందూ పత్రికలో తాము టిక్ చేసుకున్న కచేరీ వివరాలను మధ్యమధ్యలో చూసుకుంటూ.. దిగవలసిన గమ్యస్థానంపై తదేక దృష్టితో సిటీబస్సులలో ప్రయాణం సాగించే ముదిమి వయస్కులు..వరుస కచేరీలు వింటూ, విరామ సమయంలో అదే సభా ప్రాంగణంలో ఏర్పాటుచేసిన ఫలహారశాలలో గబగబా ఇడ్లీసాంబార్ తిని, కాఫీ సగం తాగి, ఈలోపే తరువాతి కచేరీ ఎక్కడ ఆరంభిస్తారో అని, పరుగులాంటి నడకతో తిరిగి హాలులోకి వడివడిగా చేరుకొనే మధ్యవయసు శ్రోతలు.. తలనిండా పూలు పెట్టి, ముక్కు పుడక పెట్టి, పట్టుచీరె కట్టి, కచేరీలకు సకుటుంబంగా విచ్చేసే, ఎమ్మెస్ సుబ్బులక్ష్మిగారిని పోలిన మహిళామణులు...

మైలాపూర్, టీనగర్ వీధుల్లో అడుగడుగునా కేసెట్, సీడీ షాపులు...వాటి ముందు శాస్త్రీయ సంగీత కళాకారుల కటౌట్లు, సభలముందు బారులుతీరిన కార్లు.. రాత్రిపూట కచేరీలు అయేసరికి ఆలశ్యం అవుతుంది కనుక, సభవారు ఆర్టీసీవారి సౌజన్యంతో ఏర్పాటుచేసిన ప్రత్యేక సిటీబస్సులు..

దేవకన్యలను తలపించేవిధంగా అలంకరించుకొని, ప్రదర్శనకు సమాయత్తమయే భరత నాట్య శిరోమణులు.. సంగీత కచేరీలో వెనుక వరుసలో సీటు దొరికినా, నిరుత్సాహ పడక,బైనాక్యులర్స్ ద్వారా వేదికపై సహకరిస్తున్న వాయులీన, మృదంగ విద్వాంసుల అంగుళులను నిశితంగా అధ్యయనంచేసే వాద్య విద్యార్థులు..

అందరూ తమనే చూడాలని, కాదు..కాదు.. చూస్తున్నారని భావిస్తూ, ఒకింత గర్వంతో శిష్యులను వెంటవేసుకొని, సభలోకి ఆర్భాటంగా అరుదెంచే ప్రౌఢ విద్వన్మణులు..

మ్యూజిక్ అకాడెమీ రెస్ట్ రూములో ఉన్నామన్న స్పృహలేక, తాము అప్పటివరకూ విన్న కాంభోజిరాగాన్ని అక్కడకూడా బాహాటంగా పాడుకొనే సంగీత వీరాభిమానులు...

'ఈ ఫలాని క్యాంటీన్లో తైర్ వడై అదుర్స్.. మిస్సవకండి..' అంటూ క్యాంటీన్ గోడకు వ్రేలాడే

సర్టిఫికెట్లు..వాటి క్రింద ప్రఖ్యాత సంగీత విద్వాంసుల సంతకాలు...

ఒకటేమిటి? ఎన్నో..ఎన్నెన్నో అనుభవావాలు... పుష్కరంపాటు నేను, ''వినడానికి మాత్రమేవెళ్లి'', చూసిన చెన్నై డిసెంబరు 'మార్గళి సంగీతోత్సవం' లో సన్నివేశాలు..

చెన్నై ఇళ్లలో పనిమనుషులు సైతం,' త్వరగా అంట్లపని ముగించుకు పోవాలి.ఇవాళ కృష్ణగానసభలో ఎమ్మెల్వీ అమ్మ కచేరీ..' అనుకుంటారట! అక్కడి సంగీత సభలలో మైకులు పెట్టేవానికి తెలిసినన్ని రాగాలు, తెలుగునాట సంగీత పాఠాలు చెప్పే సగటు టీచరమ్మకు తెలియవంటే...అతిశయోక్తి కాదు.

చిన్నతనంలో మ్యూజిక్ అకాడెమీలో ఉదయంపూట జరిగే సోదాహరణ ప్రసంగాలు నేను సాధారణంగా మిస్ అయేవాణ్ణికాదు. ఎందుకంటే వాటికి టిక్కెట్ ఉండదు. సంగీత పరమైన ఎన్నెన్నో అపురూప విషయాలు ఆసమయంలో చర్చకొచ్చేవి. ఎక్కువగా తమిళంలో చెప్పినా దాదాపుగా అర్థమైపోయేవి.

అన్ని ప్రాంతాల,శైలుల సంగీతాలూ అక్కడ వినిపించేవి.

విశ్వవిఖ్యాత కళాకారులు రవిశంకర్ గారి సితార్, భీంసేన్ జోషి, శమ్మంగుడి, బాలమురళి, జేసుదాస్ గార్ల గాత్రం, అంజాద్ ఆలీఖాన్ గారి సరోద్, హరిప్రసాద్ చౌరాసియాగారి వేణువు,జకీర్ హుస్సేన్ గారి తబ్లా, శివ్ కుమార్ శర్మ గారి సంతూర్, చిట్టిబాబు గారి వీణ, లాల్గుడి, ఎమ్మెస్ గోపాలకృష్ణన్ వాయులీన కచేరీలు ఎన్నోమార్లు చెన్నైలో విన్నాను.

ఒకే సమయంలో దాదాపు పాతిక పెద్దసభలు కచేరీలు నిర్వహిస్తూ ఉంటాయి.నేను వినదలుచుకున్న గాయకుడి కచేరీకి ఏసభలో మంచి ప్రక్కవాద్యాలు ఉన్నాయో చూసుకొని,అక్కడకు వెళ్ళేవాణ్ణి.ఒక్కొక్క సందర్భంలో కచేరీ విందామనుకున్నా, టిక్కెట్ కొనేందుకు తగిన సొమ్ములుండేవి కావు. కచేరీ ప్రారంభమయ్యేది... హాలు బయట రోడ్డు పైన పచార్లుచేస్తూ చెవినపడిన సంగీతంవింటూ, ఒక గంట కాలక్షేపం చేసేవాణ్ణి. కొంత సేపటికి హాలులో కొన్ని సీట్లు ఖాళీ అయ్యేవి. అప్పుడు టిక్కెట్ లేనివారిని లోపలికి పంపేవారు. అలా ఎన్నో కచేరీలు విన్నాను.

మ్యూజిక్ అకాడెమీలో స్టేజిపైన కూర్చుంటే తక్కువ టిక్కెట్ వసూలు చేసేవారు. అయితే అక్కడ గాయకుణ్ణి ప్రక్కనుంచో, వెనుక నుంచో మాత్రమే చూసే అవకాశం ఉంటుంది. అయితేనేం? సంగీతం వినేదేకానీ చూసేది కాదుకదా! అని సరిపెట్టుకొనేవాణ్ణి.

1978-91 సంవత్సరాల మధ్య నేను హాజరైన ప్రతి కచేరీకీ నాకు ఎదురయ్యేవాడు నావయసున్న ఒక స్థానిక వ్యక్తి. అతను, నేను అనేకమార్లు సంగీత పోటీలలో పాల్గొని, బహుమతులు పంచుకున్నాము..

ఈనాడు ఆవ్యక్తి ఎంత ఎత్తుకు ఎదిగాడంటే.. మ్యూజిక్ అకాడెమీ ఇచ్చే విశిష్ట 'సంగీత కళానిధి' బిరుదాన్ని అందుకున్నాడు. అతను ఈమధ్య బెజవాడలో కచేరీ చేయటానికి వచ్చినపుడు నన్నుచూసి గుర్తుపట్టి, ఎంతో అభిమానంతో పలకరించి గతాన్ని గుర్తుచేసుకున్నాడు. అతనే.. శ్రీ సంజయ్ సుబ్రహ్మణ్యం.

★ ★ ★

1991లో బెజవాడ ఆకాశవాణిలో నాకు ఉద్యోగం వచ్చాక, నేను చెన్నై మార్గళి (మార్గశిరమాస) ఉత్సవాలకు పెద్దగా వెళ్ళింది లేదు. ఆమధ్య డిసెంబరులో 'నాద ఇన్బం' అనే సభ ఆహ్వానంపై కచేరీ పాడటానికి వెళ్ళిన నాకు, అక్కడి సంగీత వాతావరణంలో కీలక మార్పు కనిపించింది. కళాకారులకు, కచేరీల వాసి కన్నా, రాసిపై ధ్యాస మిక్కిలిగా కనబడింది.

సభల సంఖ్య అయితే పెరిగింది కానీ శ్రోతల సంఖ్య తగ్గింది. అక్కడివారే, పాడినవారే అన్నిచోట్లా పాడుతుండటం కనిపించింది. భక్తి, సాహిత్య భావాలకు ఇవ్వవలసిన ప్రాధాన్యత స్థానే కచేరీ రేటింగ్స్, విద్వత్ కసరత్తులు కనబడ్డాయి. శ్యామశాస్త్రి, త్యాగరాజాదుల తెలుగు కృతులు తగ్గి, పాపనాశం శివన్, తులసీవనం వంటి తమిళ రచనలు ఎక్కువయ్యాయి. పొరుగు రాష్ట్రాల కళాకారులకు అవకాశాలు మృగ్యమైపోయాయి. ఒకే మూసలో పోసిన తమిళ మార్కు సంగీతమే తప్ప మరొక శైలి వినపడటంలేదు. ప్రతిభకన్నా, ధనబలంగల ప్రవాసభారతీయ కళాకారులకు ప్రాధాన్యత పెరుగుతోదనే విమర్శ మ్యూజిక్ అకాడెమీ వంటి ప్రతిష్టాత్మక సభలకూ తప్పట్లేదు. ఒకప్పుడు జనంతో కిటకిటలాడిన అక్కడి డిసెంబరు సభలు, ఈనాడు ఒకటిరెండు తప్పించి, వెలవెల పోతున్నాయి. కచేరీల కోసం వచ్చే జనం కన్నా, క్యాంటీన్లకు వచ్చే జనం పెరిగారనే విమర్శలూ వినబడుతున్నాయి..

భాషా, ప్రాంతాలకు అతీతంగా వైవిధ్య భరితమై, నిత్యనూతనంగా ఉండాల్సిన మన సంగీతానికి ఈస్థితి ఎందుకు వస్తోంది?

'మనకిష్టమని ఏడాది పొడుగునా ఒకే కూరతో రెండుపూటలా భోజనం వడ్డిస్తే ఏమి నష్టమో'... అదే ఇక్కడా జరుగుతోంది. షడ్రసోపేతమైన భోజనంలాగే, అన్ని ప్రాంతాల, సంప్రదాయాల సంగీతం ఆస్వాదించాలి. కార్యక్రమాలలో తమిళేతర సంగీత కళాకారులకూ తగు ప్రాతినిధ్యం ఇవ్వాలి.

పెళ్ళి కుదిరితే గాని పిచ్చి కుదరదు; పిచ్చి కుదితేగాని పెళ్ళి కుదరదు' అన్న చందంగా చెన్నైలో పేరు తెచ్చుకుంటేనేగాని లోకం గుర్తించదు; లోకం గుర్తిస్తేగాని చెన్నైలో అవకాశం రాదు.

అసలు సంగీతమే అక్కరలేని మన తెలుగునాట, వర్ధమాన కళాకారుల భవిషత్తు ఏమిటి? ఇక్కడా అవకాశాలు లేక, తమిళనాట గుర్తింపు రాక,వారు ఎటువెళ్ళాలి?

అందుకే, తెలుగు భాషకు, మహోన్నత సంస్కృతికి జీవనాడియైన కర్ణాటక సంగీతాన్ని తెలుగునాట వ్యాప్తిచేసేందుకు, మనవారు ముందుకు రావాలి. విద్యార్థులకు చిన్నతనం నుండే ఉన్నత స్థాయి సంగీత విద్య అందించాలి.' సంగీతం నేర్చుకున్నవారి భవితవ్యం దివ్యంగా ఉంటుందనే' భరోసాను ఈతరానికి కలిగించాలి. ప్రతిభ కలిగిన తెలుగు కళాకారులు, తెలుగునేలను విడచి, తమిళనాడు బాట పట్టకుండా కాపాడుకోవాలి. "మరో చెన్నై"ని తెలుగునాట మనం సృష్టించుకోవాలి... అందుకు నావంతు ప్రయత్నం నేను చేస్తున్నాను...మీరూ చేస్తారని ఆశిస్తున్నాను....

## Bharat Ratna Musicians – 4

# BHARAT RATNA BISMILLAH KHAN

## (Star Maestro)

**Cdr G. Sriramarao,** I.N(Retd)



ఈ శీర్షికలో రాబోయే సంచికలలో గానకళ పాఠకులకు ప్రముఖ సంగీత విద్వాంసులపై భారతదేశంలో వెలువడిన తపాలా బిళ్ళలు మరియు కవర్లు, ఇతర ముఖ్యమైన అంశాలను సచిత్రమాలికగా మనకు అందజేయబోతున్న Cdr G. శ్రీరామారావు (విశ్రాంత ఉద్యోగి) జాతీయ స్థాయిలో పేరొందిన స్టాంపులు, నాణేలు తదితర అమూల్యవస్తువుల సేకరణాభిలాషి.

ప్రత్యేకంగా భారతీయ సంగీతానికి సంబంధించిన కళాకారులపై వెలువడిన పై విషయాలను సేకరించి, పలు పట్టణాల్లో ప్రదర్శనలను ఏర్పాటు చేసిన ఔత్సాహికులు. భారత నావికాదళంలో కమిషన్డ్ అధికారిగా 1967 నుండి 1993 వరకూ కమెండర్ హోదాలో పనిచేసినవారు. సంగీతాభిరుచి కలిగి 1990-96 ప్రాంతాలలో కులపతి ఐ.వి.యల్. శాస్త్రి గారి మార్గదర్శకత్వంలో గురువులు శ్రీ వి.వి. వి. శంకరం వద్ద సంగీత విద్యనభ్యసించి, డిప్లమో పొందారు.

ఈ సేకరణ క్రమంలో 4000 స్టాంపులు, 200 నాణేలు, 180 కాగితపు కరెన్సీ, సంగీతానికి సంబంధించినవి సంపాదించుటయే కాకుండా ప్రపంచవ్యాప్తంగా 13 దేశాలలో సంగీతవిద్వాంసుల పేర నిర్వహించబడుచున్న 76 పోస్టాఫీసుల విలువైన సమాచారం కూడా వీరివద్ద ఉంది. విశాఖ మ్యూజిక్ అకాడమీ, విశాఖపట్నం వారి సంగీత కార్యక్రమాల్లో వీరి సేకరణ ప్రదర్శనను తిలకించిన పద్మవిభూషణ్ శ్రీమంగళంపల్లి బాలమురళీకృష్ణ నుండి ప్రసంశలు అందుకున్నారు. ప్రఖ్యాత మద్రాసు మ్యూజిక్ అకాడమీలో కూడా 2014వ సంవత్సరంలో వీరి సేకరణాంశాలు 4 రోజుల పాటు ప్రదర్శనకు ఉంచబడ్డాయి. లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్, ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లో వీరి సేవకు గుర్తింపు లభించింది.

గానకళ ద్వారా ఆ విశేషాలను అందిస్తున్న శ్రీ రామారావు గారికి ధన్యవాదాలు.

---

Ustad Bismillah Khan was the fourth classical Musician and the the second nstrumentalist to be honoured with the highest Indian civilian award of Bharat Ratna in 2001. Born on 21 March 1916 into a family of taditional Muslim musicians, often referred to by the title Ustad, was an Indian Musician credited with popularizing the Sehnai, a subcontinental wind instrument of the oboe class. While the Sehnai had long held importance as a folk instrument played primarily in traditional ceremonies, Khan is crdited with elevating its status and bringing it to the concert stage.




Bharat Ratna Award Bharat Ratna Award (Reverse Side)



**President KR Narayanan presenting Bharat Ratna to Ustad Bismillah Khan**

His father was court musician employed in the court of Maharaja Keshav Prasad singh of Dumoron Estate in Bihar. His grand father was also musician in Dumraon palace. Upon seeing the new born his grand father is said to have exclaimed 'Bismillah' or 'in the name of Allah', and there after he came to be known by this name. He was moved at the age of six, to Varanasi in the state of Uttar Pradesh to be apprenticed. to his maternal uncle, a Shehnai player attached to Kashi Viswanath Temple. At the age of 14 Bismillah accompanied his uncle to the Allahabad Music Confeence. Although a devout Shia Muslim, throughout his long career Khan took issue with rigidity orthodox islam elders who felt that playing Shehnai was contrary to his principles of faith. Instead , he came to be seen as an example of the successful, progressive culture that evolved out of Hindu-Muslim encounter in India.



Bismillah Khan had a brief association with movies. He played the Shehnai for superstar Rajkumar's role of Appanna in the Kannada movie Sanadhi Appanna which became a blockbuster. He acted in the movie Jalsaghar, a movie by Satyajit Ray and provided Shehnai in Goonj Uthi Shehnai(1959). In the film Graduate there is a poster advertising 'Bismillah Khan and the seven Musicians' on a street of Berkeley, California.


India post honoured Bismillah Khan by issue of a stamp with him and Sehnai




Stamp of Rs. 5 issued on 21-8-2018




**First Day cover with a cancellation of beautiful Shehnai**




Folder issued on 21-8-2018



Two great Musical Stalwarts in their own fields of Sitar and Shehnai

and both Bharat Ratnas playing on the same stage




A Rs.3 stamp in the series of Makers of India was also issued on Bismillah Khan in March 2016

In addition to Bharat Ratna in 2001, he was awarded with the Padma Vibhushan in 1980

Padma Bhushan in 1968

Padma Shri in 1961

Sangeet Natak Academy award in 1966

Tansen Award from the Govt of Madhya Pradesh

Honarary Doctorates from Benaras Hindu University, Visva Bharathi University and Santiniketan

Talwar Mausiquee from Republic of Iran in 1992

Fellow of Sangeet Natak Academy in 1994

He had participated in the World Exhibition in Montreal, and Cannes Art Festival and Osaka Trade Fair

His 80th Birthday was celebrated by the World Music Institute in New York

He was requested to come to play Shehnai at the First Independence Day celebrations on 15th August 1947, in Delhi Red Fort by the then Indian Prime Minister Pandit Jawaharlal Nehru and he played on the evening of 15 August 1947. He also performed Raga Kafi at the first Republic Day from the Red Fort on 26th January 1950.




A street was named as Bharat Ratna Ustad Bismillah Khan Marg in Hyderabad Telangana on 7 April 2013, by Pandit Hariprasad Chaurasia and Famous Telugu Film Director K Viswanath



Prime minister Vajpayee and other dignitaries welcoming him

Bismillah Khan died on 21 August 2006 due to cardiac arrest after deteorating health. Ustad's last wish - to perform at India Gate could not be fulfilled. He wanted to pay tributes to the martyers. He is survived by five daughters, three sons and a large no of grand childrren and great grand children, and his adopted daughter Soma Ghosh( a hindustani shastriya sanget exponent). His body along with a Shehnai was buried at Fatemaan burial ground of old Varanasi under a neem tree with a 21 – gun salute from the Indian Army. The Govt of India declared a day of national mourning on his death.

# సంగీత సభల కార్యకలాపములు - 'విహారి'

## "గాయకసార్వభౌమ సంగీత పరిషత్" మరియు "స్వరఝరి"- విజయవాడ.



"గాయకసార్వభౌమ సంగీత పరిషత్" మరియు "స్వరఝరి"- విజయవాడ. సంస్థల ఆధ్వర్యంలో జరుగుతున్న శ్రీ పారుపల్లి రామకృష్ణయ్య పంతులు గారి 140వ జయంతి ఉత్సవాలలో భాగంగా, బెజవాడలో గాంధీనగర్ చిట్టూరి హై స్కూల్ ఆడిటోరియంలో, "గాయకసార్వభౌమ సంగీత పరిషత్" ఆధ్వర్యంలో శ్రీ పారుపల్లి రామకృష్ణయ్య పంతులు గారి 140వ జయంతి ఉత్సవాలు 5-12-2023 ఉదయం గురుపూజతో ప్రారంభం అయ్యాయి.

సాయంత్రం కచేరీలు కుమారి ఎస్. సాత్విక,కుమారి కె. భువన శ్రుతి గానంతో మొదలయ్యాయి.శ్రీ బి. వి. ఎస్.కృష్ణ వైలిన్తో,శ్రీ ఆర్.సుధాకర్ మృదంగంతో సహకరించారు. అనంతరం కుమారి కొత్తపల్లి శ్రీదేవీ ప్రవల్లిక గాత్ర కచేరీ జరిగింది.శ్రీ హేమాద్రి చంద్రకాంత్ వైలిన్తో,శ్రీ ఆర్.సుధాకర్ మృదంగంతో సహకరించారు. శ్రీ ఉపద్రష్ట రామస్వామి శాస్త్రిగారు గుడివాడ నుండి విచ్చేసి,కళాకారులను సత్కరించారు. ప్రతికూల తుఫాన్ వాతావరణం ఉన్నా, కార్యక్రమాలు యధావిధిగా జరిగాయి.

రెండవరోజు (6-12-2023) శ్రీ చిట్టా కార్తీక్ వీణాగానం,శ్రోతలను సమ్మోహితులను చేసింది.శ్రీ పారుపల్లి సుబ్బారాయ ఫల్గుణ్ మృదంగంతోను,శ్రీ ఎం.హరిబాబు ఘటంతోను అనుసరణగా ప్రోత్సాహకరంగా సహకారం అందించారు.శ్రీ బి. వి. శర్మ కళాకారులను సంస్థ పక్షాన సత్కరించారు. మూడవరోజు (7-12-2023) శ్రీ మోదుమూడి









సుధాకర్ "కళ్యాణి ఏకరాగ సభ" పాడారు.శ్రీ అన్నవరపు రామస్వామి కార్యక్రమం ఆసాంతం ఉండి,ఆశీస్సులు అందజేశారు.

చిరంజీవి మృదుల (చెన్నై) వైలిన్ తోను, చిరంజీవి సుసరాపు కుమార విఘ్నేశ్ (శ్రీకాకుళం) మృదంగం తోనూ చక్కగా సహకరించారు.

బాల కళాకారులను ప్రోత్సహించేందుకు సుధాకర్ గారు నిర్వహించిన ఈ నాల్గవ "ఏకరాగ సభ" దిగ్విజయవంతం అయింది.

**పాడిన అంశాలు:**

అట తాళ వర్ణం; శ్రీమదాది త్యాగరాజ గురు–మైసూర్ వాసుదేవాచార్య; అమ్మరావమ్మ–త్యాగరాజస్వామి; హిమాద్రి సుతే పాహిమాం –శ్యామశాస్త్రి; భజరే రే చిత్త – దీక్షితార్; సుందరి నీ దివ్య రూపము –త్యాగరాజస్వామి; " సొగసు నీ సొమ్ము కళ్యాణి రాగిణీ" అనే రాగం, తానం, పల్లవి; ఆ నీలి నగరిలో– రాయప్రోలు సుబ్బారావు(లలిత గీతం); రాగ తాయ మాలిక తిల్లాన– బాలమురళీకృష్ణ రచన అలరించాయి.

అయిదవ మరియు చివరి రోజు, 9–12–2023 న,ఆస్ట్రేలియా నుండి విచ్చేసిన శ్రీ కొరిడే సుధీర్ శర్మ గాత్ర కచేరీ హృద్యంగా జరిగింది. శ్రీ ఎస్.జనార్దన్(బెంగళూరు) వైలిన్తో,శ్రీ బి.ఎస్. ప్రశాంత్ (బెంగళూరు) మృదంగంతో,శ్రీ శ్రీధర్ (హైదరాబాద్) కంజిరతో చక్కగా సహకరించారు. సుధీర్ శర్మ గానం చేసిన 11 కృతులలో 9 త్యాగయ్య గారి కృతులు,ఒకటి త్యాగయ్యగారి శిష్యులైన శ్రీ వీణ కుప్పయ్యర్ రచన ,ఒకటి త్యాగయ్య గారి ప్రశిష్యులైన శ్రీ మైసూర్ వాసుదేవాచార్య గారిది. త్యాగయ్య గారి శిష్యప్రశిష్యులు నిర్వహించే ఈ ఉత్సవాలలో త్యాగయ్య గారి వారసుల రచనలను భక్తితో సమర్పించిన శ్రీ సుధీర్ శర్మ ప్రత్యేక ప్రశంసార్హులు.

పద్మశ్రీ అన్నవరపు రామస్వామి గారు కార్యక్రమానికి విచ్చేసి,సభ సత్కారాన్నిస్వీకరించారు. శ్రీ సుధీర్ శర్మ గారు,శ్రీ అన్నవరపు గురువుగారు, శ్రీమతి పాటిబండ్ల జానకి గారు,శ్రీ ఉపద్రష్ట రామస్వామి శాస్త్రి గార్లు కార్యక్రమాలకు తమ విరాళాన్ని అందజేశారు. అయిదురోజుల గాయక సార్వభౌముల జయంతి వేడుకలు దిగ్విజయవంతంగా పరిసమాప్తం అయ్యాయి.





# "స్వరఝరి" - విజయవాడ

సంస్థ ఆధ్వర్యంలో డా.కొల్లూరు వందన (తిరుపతి) గారి గాత్ర కచేరీ 3-11-2023 న, బెజవాడలో వీనుల విందుగా సాగింది. సహకారాలు: కుమారి VSPG శివాని - వైలిన్, శ్రీ కోటిపల్లి రమేష్ - మృదంగం, శ్రీ ఎం.హరిబాబు - ఘటం పై సహకరించారు.

బేగడ రాగ వర్ణం, మాపాల వెలసి- అసావేరి - త్యాగయ్య, నామ కుసుమముల- శ్రీరాగమ్- త్యాగయ్య, నత జనపాలిని- నళినకాంతి- తంజావూరు శంకర అయ్యర్, హిరణ్మయీం- లలిత - దీక్షితార్, హిమగిరి తనయే- శుద్ధ ధన్యాసి- ముత్తయ్య భాగవతార్, ఎవరి మాట విన్నావో- కాంభోజి -త్యాగయ్య, "రంజని!నిరంజని! త్రిపుర భంజని! మృదు పంకజ లోచని!".. రంజని రాగంలో రాగం, తానం, పల్లవి.. ఖండ త్రిపుట తాళం రంజని, శ్రీరంజని, జనరంజని, శూరరంజని (రాగమాలిక స్వరకల్పన), శ్రీ రామచంద్ర కృపాళో భజమన (భజన్) మొదలైన అంశాలతో రక్తిగా కచేరీ నడిపించారు.

వీణ విదుషీమణి శ్రీమతి అచల శంకరనాథ్ (హైదరాబాద్)కార్యక్రమాన్ని తమ తల్లిగారు ప్రతాపగిరి దుర్గాదేవి గారి పేరిట సమర్పించారు.



# ఫ్రెండ్స్ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ విజయనగరం

అలరించిన వయోలిన్ యుగళ కచేరి......

661వ కార్యక్రమం ప్రఖ్యాత వయోలిన్ విద్వాంసులు పద్మశ్రీ ద్వారం వెంకటస్వామి నాయుడు జయంతి శనివారం 04.11.2023 రాత్రి కొత్తపేటలో గల సంస్థ కార్యాలయంలో జరిగింది. ముందుగా నాయుడు గారి చిత్రపటానికి సంస్థ అధ్యక్షులు శ్రీ ధవళ సర్వేశ్వర రావు, హేమకామేశ్వర,మహారాజ మహిళా కళాశాల పూర్వ అధ్యక్షురాలు లలిత కుమారి కళాకారులు పుష్పమాలలు వేసి నివాళులర్పించారు. కార్యదర్శి డాక్టర్ మండపాక రవి నాయుడు గారి జీవితవిశేషాలను తెలియజేసి కళాకారులను వేదికపైకి ఆహ్వానించారు. అనంతరం విద్వాంసులు హనుమంతు రామచరణ్, పప్పు జ్ఞానదేవ్ వయోలిన్ యుగళ కచేరి జరిగింది. వీరు భైరవి అటతాళ వర్ణం, కాపీ రాగంలో నీవల్ల గుణదోషమేమి- త్యాగరాజు, అనాధుడను గాను, కల్యాణి రాగం ఆదితాళంలో ముఖ్యాంశంగా ఏతావునరా - త్యాగరాజు మొదలైన కృతులు వాయించారు. వీరికి మృదంగంపై శ్రీ యం.కామేష్, మోర్సింగ్ పై శ్రీ టి.చైతన్య సహకారాన్ని అందించారు. ద్వారం వారి వంశం నుండి ప్రఖ్యాత వయోలిన్ విద్వాంసులు కేంద్ర సంగీత నాటక



అకాడెమీ అవార్డ్ గ్రహీత శ్రీ ద్వారం దుర్గాప్రసాదరావు, శ్రీయుతులు పి. త్రినాథరావు, చాగంటి రాజ్యలక్ష్మి, వి.అప్పలస్వామి, ఏడుకొండలు, గోపాలరావు తదితర విద్వాంసులు, సభ్యులు శ్రీయుతులు టి. మహేశ్వరరావు, సన్యాసిరావు, సంగీతాభిమానులు, విద్యార్థులు, ప్రముఖులు పాల్గొన్నారు...



# నివాళి



Carnatic Quartet regrets to inform the Sad Demise of renowned Vidwan Sangeetha Natak Academi Awardee **Shri.O.S.THYAGARAJAN** 31st of December 2023 !

Our heartfelt Condolences to the bereaved family.

Our Deepest Condolences to his disciples and family members!

May His Soul Rest In Peace !

Pranams.

O. S. Thiagarajan (born 3 April 1947 is a Carnatic Musician based in Chennai. He is the son and disciple of Sangeetha Booshanam O.V.Subrahmanyam. He learnt music from Sangeetha Kalanidhi T. M. Thiagarajan, while Padmabhushan Lalgudi Jayaraman provided guidance/ mentorship early in his career. An 'A-Top' graded artist of the All India Radio and of Doordarshan, he has been giving a large number of concerts, and is considered one of the eminent artists of his generation. He is regularly featured by all leading sabhas in Chennai as well as throughout India and has been accompanied by top accompanists such as Lalgudi Shri.G.Jayaraman, M.S. Gopalakrishnan, V.V. Subrahmanyam on violin, Palghat Mani Iyer, Dr T.K.Murthy, Palghat Raghu, Karaikudi Mani, Trichy Sankaran, Umayalpuram Sivaraman on mridanagm, Shri.G Harishankar on Kanjira and Vikku Vinayakaram on Ghatam.He has toured many countries, including USA, Canada, Australia, Singapore, Middle East, Malaysia, Hong Kong, South Africa, and many cities in Europe. He worked as Dean and Faculty of Fine Arts at Annamalai University for 5 years. He has trained many disciples who are active on the concert circuit.

# ఘనంగా జరిగిన ఆదిభట్ల నారాయణదాస వర్యుల 159వ మరియు వారి ప్రియశిష్యులు నేతి లక్ష్మీనారాయణ భాగవతుల 125వ జయంతి ఉత్సవములు.

**గండూరి శారద**



శ్రీ నారాయణదాసు
(1864-1945)



'హరికథా కేసరి' కీ. శే. నేతి లక్ష్మీనారాయణ భాగవతులు [1897-1979]

స్థానిక గుంటూరులోని త్యాగరాజ సాంస్కృతిక సంఘం ప్రాంగణములో, నవంబర్ 4, 2023 శనివారం నాడు 'హరికథా కేసరి' 'హరికథా ప్రవీణ' కీ. శే. నేతి లక్ష్మీనారాయణ భాగవతుల కుటుంబము మరియు అన్నమయ్య పరివారము, హైదరాబాద్ వారి సంయుక్త నిర్వహణలో 'హరికథా పితామహ', 'హరిదాస జగద్గురువులు శ్రీమదజ్జాడ ఆదిభట్ల నారాయణదాస వర్యుల 159వ మరియు వారి ప్రియశిషులు నేతి లక్ష్మీనారాయణ భాగవతుల 125వ జయంతి ఘనంగా జరిగినది.

ఆనాటి కార్యక్రమమునకు ముఖ్య అతిధిగా శ్రీ బుర్రా పద్మనాభ శర్మ భాగవతులు (కన్వీనర్ – శ్రీ

నారాయణదాస ఉత్సవముల కమిటీ, విజయవాడ) మరియు ఆత్మీయ అతిధిగా శ్రీ యనమండ్ర వెంకట కృష్ణయ్య (వ్యవస్థాపకులు, అన్నమయ్య పరివారము, హైదరాబాద్) విచ్చేసారు.

మహనీయుల సంస్మరణ సభ ముందుగా శ్రీమతి కాళ్ళ నిర్మల భాగవతారిణి పాడిన "హరికథా పితామహ ఆదిభట్టాన్వయ.. సరిగమా సుతులగొను సంగీత రసమయా.. వరమృదుల బహుభాష భాగవత శుభవేష .. చిరత రాద్భుతభాస శ్రీ నారాయణ దాస....) గేయంతో ప్రారంభమైనది (గేయ రచయిత డాక్టర్ అమ్ముల విశ్వనాధ భాగవతార్).

శ్రీ బుర్రా పద్మనాభ శర్మ గారు మాట్లాడుతూ, ఉభయ తెలుగు రాష్ట్రములలో హరికథ అంటే నారాయణదాసు గారు ... నారాయణదాసు గారు అంటే హరికథ అని తెలియనివారు ఉండరన్నారు. హరికథ అనేది పూర్వకాలం నుండి ఉన్నప్పటికీ, శ్రీ నారాయణదాసు గారు హరికథాగానమునకు ఒక కొత్త ఒరవడి సృష్టించి – అనగా ఒక పద్యం, ఒక కీర్తన, ఒక గద్యముతో (అనగా వచనముతో) పాటు నృత్య గీత వాద్యములతో దేశములోని రసికులందరినీ అలనాడు ఆనందపరచారని; దాసుగారు మనదేశంలో హరికథారచనకు, ప్రచారానికి మార్గదర్శకులు అని; వారి నృత్య, నాట్య, గానములు అద్వితీయములు అని; పంచముఖి , షణ్ముఖి వంటి అసాధ్యములైన తాళములలో రచనలు చేసి, గానము చేసి అనేకమంది మహారాజుల, జమీందారుల, ప్రముఖులైన ఆచార్య సర్వేపల్లి రాధాకృష్ణన్, విశ్వకవి రవీంద్రనాథ్ ఠాకూర్, సరోజినీ నాయుడు, తిరుపతి వేంకట కవులు, చెళ్ళపిళ్ళ వేంకట శాస్త్రి, ప్రముఖ విద్వాంసుల మన్ననలు పొందిన ఘన విద్వాంసుడు అని; 'ఆట పాట మాట మీటల మేటి' గా ప్రసిద్ధినొందారు అని వక్కాణించారు.

అంతే కాకుండా దాసుగారు కధకు నిలబడి చెపుతుంటే సర్వశాస్త్రాలు, కళలు నవరస సమ్మేళనం పొంది ఆకాశగంగా ప్రవాహాన్ని పోలిన గాన రసంతో పెల్లుబుకుతూ సాక్షాత్తు పరమాత్ముని విశ్వరూపాన్ని తలపుకు తెచ్చేదని వారి ప్రియశిషులు నేతి లక్ష్మీనారాయణ భాగవతులు సగర్వంగా చెపుతూ






ఉండేవారు అని చెప్పారు. దాసుగారి శిష్యవర్గంలో చాలామంది ఉన్నప్పటికీ, శ్రీ నేతి లక్ష్మీనారాయణ గారికి, శ్రీ వాజపేయాజుల సుబ్బయ్య దాసు గారికి ఒక విశిష్ట స్థానము ఉన్నదని, దాసుగారు వీరివురికి వారి ఇతర కథలతో పాటు యదార్ధ రామాయణము ఆరు కాండలు పూర్తిగా చెప్పి నేతి వారిని, సుబ్బయ్యదాసు గారిని 'రామాయణ సోదరులు' అని నామకరణం చేసారని; దాసుగారు ఇంటినుండి సంగీతకళాశాలకు వెళ్ళేటప్పుడు వారి వెంట నేతి వారు, సుబ్బయ్యదాసు గారు మార్గమధ్యమందే గురుశుశ్రూష చేస్తూ ఒకరు గొడుగు, ఇంకొకరు పుస్తకంపట్టుకొని వెళుతూవుంటే, దాసుగారు ముందు నడుస్తూ ఉంటె.. ఆ సన్నివేశమును తిలకించిన పురజనులు వాల్మీకి వెంట కుశలవులను జూచినట్లు పులకించి పోయెడివారు అని శ్రీ పద్మనాభ శర్మ గారు పొగడినారు. నేతి వారి గురుభక్తి చాల గొప్పదని, వీరు 1951 లో విజయవాడలో గురువుల విగ్రహం ప్రతిష్ట చేసి జీవిత చరమాంకము వరకు గురువుల ఉత్సవములు చేసి తరించిన మహనీయమూర్తి అని, ఆ ఉత్సవములు శిష్య ప్రశిష్యులచే నేటికి 73 సంవత్సరములుగా విశేషముగా జరుపుతున్నామని కూడా శ్రీ పద్మనాభ శర్మ తెలియచేసారు.

శ్రీ యనమండ్ర వెంకట కృష్ణయ్య గారు మాట్లాడుతూ .. దాసుగారు బహుముఖ ప్రజ్ఞాశాలి అని, ఏక సంధాగ్రాహి అని, తల్లి గర్భములో ఉన్నప్పుడే వారు పురాణ కాలక్షేపములలో చెప్పే భాగవత, రామాయణములలోని విశేషములను గ్రహించారని, తద్వారా అనేక హరికథలను రచన చేసి అనేక ప్రదేశములలో ప్రదర్శనలిచ్చి మన్ననలు పొందారని అన్నారు. కాకినాడ సరస్వతి గానసభ స్థాపించిన నాటినుండి సుమారు నాలుగు దశాబ్దముల పాటు ప్రతీ సంవత్సరము దాసుగారి హరికధగానముతో ఉత్సవములు ప్రారంభమయ్యేవని వక్కాణించారు.

దాసుగారు 'హరికథా బ్రహ్మ' అని, 'హరికథా' ప్రక్రియద్వారా ఆనందం కల్పిస్తూ పురుషార్ధ సాధనకు అవసరమైన విజ్ఞానాన్ని తెలుగు రాష్ట్రముల నలుదిశలా తమ హరికథా ప్రదర్శనల ద్వారా పండిత పామరులందరికి సుమారు ఆరు దశాబ్దాలకుపైగా పంచిపెట్టిన ఘనులని, సహస్ర చంద్ర దర్శనముచే చరితార్థుడై సిద్ధినందిన దాసుగారు మనకు చిరస్మరణీయుడు, సదా స్మరణీయుడు అని, ఇట్టి సకల కళా విశారదునకు, వరప్రసాదునకు, పుంభావ సరస్వతికి 159వ జయంతి సందర్భంగా తెలుగు జాతి జోహారులర్పించడం సర్వసమంజసము అని కూడా ప్రశంసించారు.

నేతివారి మనుమడు శ్రీ విశ్వేశ్వరరావు గారు మాట్లాడుతూ, శ్రీ ఆనంద గజపతి మాహారాజా వారు దక్షిణ భారత దేశములో విజయనగరంలో ప్రప్రధముగా 1919 లో స్థాపించిన సంగీత కళాశాలకు దాసుగారు సుమారు 19 సంవత్సరములు ప్రధానోపాధ్యాయులుగా చేసి ఎంతోమంది సంగీత విద్వాంసులను తయారుచేసి మార్గదర్శకులు

అయ్యారని; ఆ రోజులలో మైసూర్ మహరాజా వారు దాసుగారి వీణ, హరికధగానములకు ముగ్ధులై ఫోనోగ్రామ్ ద్వారా వారి గానమును రికార్డు చేసుకొని తరుచుగా వినేవారని, దురదృష్టశాత్తు అవి మనకు నేడు లభ్యములో లేవని మరియు దాసుగారు జీవించి ఉంటె ప్రతిష్ఠాత్మకమైన 'భారత రత్న' బిరుదుకు అర్హులు అని కొనియాడారు.

విచ్చేసిన అతిధులను త్యాగరాజ సాంస్కృతిక సంఘం తరపున శ్రీ వి. కృష్ణ కిషోర్ (సహాయ కార్యదర్శి), శ్రీ ఎస్. రవీంద్రనాథ్ (కోశాధికారి) శాలువలూ, జ్ఞాపికలతో ఘనముగా సత్కరించటంతో సభ ముగిసినది. మహాయనీయ మూర్తుల సంస్మరణ సభలో, ద్విభాష హరికధకులు శ్రీ తుర్లపాటి శంభయా చార్య గారు అతిథులతో పాటు కళాకారులను, త్యాగరాజ సాంస్కృతిక సంఘం కార్యదర్శి శ్రీ నేతి విశ్వేశ్వరరావు గారిని నూతన వస్త్రములతో ఘనముగా సత్కారము చేసినారు.

డాక్టర్ శ్రీమతి ఆర్. సూర్యలక్ష్మి కళాకారులను శ్రోతలకు పరిచయము చేసారు. అనంతరము, శ్రీమతి కాళ్ళ నిర్మల భాగవతారిణి (విజయనగరం) తమ మధుర గళంలో నారాయణదాస విరచిత యదార్ధ రామాయణము నుండి 'శ్రీరామ పాదుకా పట్టాభిషేకం' హరికథాగానమును గణపతి ప్రార్ధన గీతం 'నను విడనాడకు నా మనవి వినుమా.. విఘ్నం చేయకురా శ్రీవిఘ్నేశ్వర' తో మొదలుపెట్టి, క్రింది కీర్తనలను ఆద్యంతమూ అత్యంత శ్రావ్యముగా గానము చేసి శ్రోతలను ఆకట్టుకున్నారు.




సీ. రాజ్యభోగముల జిర మనుభవించితి విసివితి మిక్కిలి వృద్దునైతి (ఖమాస్ రాగం); (తోడి రాగంలో) .. రఘుకులవర్ధన రామచంద్ర మద్రమ్యత పః ఫలమా, సకల సుగుణపుంజమ; సీ. ఇపుడు నీవయస్సిర్వదే దేండ్లు నైజము గానీవు ప్రాజ్ఞుడ వేనెరుగుదు నాపుణ్యవసమున ((తోడి రాగం); (సరస్వతి రాగంలో) ... అమ్మా నేటిముచ్చటయ్యె యేమనందు మమ్మాటికీ న్మన పుట్టే మున్గిపోయే; జెంజోటి (మంజరి రాగంలో)..అనవినికైక యొకింత తలయూచి : యామంధర కనేనిట్లు యినకులమున నన్నుకు దప్ప రాజ్య మిచ్చెద రనుజునకేట్లు; (కాఫీ రాగంలో) ... మంచియుపాయమే చెప్పినావే నే మరచితిని నాటి మాట సేబాసు, కొంచెమైనా నీ మేలు మరతునా గోరంత చూడు మెటు కొండంత ఔన; (అభేరి రాగంలో) ... చీకటిగదిలో నేల బరుంటివి చెప్పవే పూవుబోడి

: నీకెట్టివంత కల్గెబల్కవా నిద్దురా ముద్దులాడి; (జెంజోటి రాగంలో) .. విడువిడు ననుముట్టకు నీ ప్రేమ తెలిసెజాలు : కడకు నవ్వులపాలయ్యె గానాబ్రతుకిట్టుల మేలు; కౌసల్యకువలె నాకున్ గట్టవెపుస్తె నాసవతి కేలుబడియైన నాపని పస్తే; సీ. వాని నడుగుటకు న్దరి వచ్చె నేడు రాజునొనరించు భరతుని : రాముని బదునాలుగేండ్లు కానలో నన్దపసిగ నిలుపు సత్యము నాప్రాణ ములును సరిగ (మోహన రాగం); (భాగేశ్వరి రాగంలో) ... అపచారమేదైన నాచరించితినా ఇపుడు నాతండ్రి నన్నేమీ పల్కరింపడు; మ్రొక్కినం గైకోడు మోమైన నెత్తడు; (సావేరి రాగంలో) .. ఎటుల విడుతు నిన్ను బుత్ర ఏమనందును కులపవిత్ర : కటకటా నేనెరుగనైతిగైక యింత చేయునంచు .. నేనునీకు రాజ్యమొసగ నేడు నిశ్చయించు కొంటి : తానొక్కటి తలచినంత దైవమొకటి చేయునయ్యో; (శహన రాగంలో) .. సీతనే బోయి వచ్చెద నీవు మాయమ్మ సేవ సేయుచు నుండుమా సుగుణసమేతా, మాతండ్రి నిను నన్ను మాడ్కిలాలించెదున్; సీ. ఈవులోకైక వీరుండ వేనెఱుగుదు కొడుకు నీ కేడనుండిన కొదవలేదు .. కాని నీ తండ్రి నిబ్బాయు కారణమున బ్రతుకజాలడనుచు నేను వగచుదాన (కేదారగౌళ రాగంలో); (బేగడ రాగంలో) .. రామచంద్ర సీతామనోహర రఘుకుల జలధిశశీ పరమాత్మా, నీమహిమ దెలియ నెంతవాడనే నీ ముద్రికదాల్ప నాతరంబా; సీ. ఎంత వాడవు నీవైన వృత్తి యొక్కటె మనకేను నినున్ గంగ దాటించినట్లు కడపుమా నన్ను గష్ట సాగారమునుండి భక్తమందార భవధూర పరమపురుష; (కేదారగౌళ రాగంలో) .. రాజుకాదగినవాడు రాముడ నేన, తేజమొసగువా డాదిత్యుడ మెర్గు పురుగవునా; (శ్రీరాగం లో) .. ఔరౌర బరతుడెంత దుండగీడు శ్రీరాముని మీద దండెత్తినాడు .. ఈగనైన వాలనిత్తునా నేను రాగ వయ్యపై నాపానమిడినాను; సీ. ఈనల్ల పాషాణ మా నీకు గద్దె యూహా రామచంద్ర లోకైక వీర, యీవల్కలంబులా నీవలివైపు దుస్తు కోమల తనుజిత కోటిమార, యీ దుంపలా నీకు స్వాదు పక్వాన్నముల్ ఛాగురే రఘుకుల సార్వభౌమ, యీ క్రూర విపినమా నీకద్ది రాజాన కీజాని తులలేని రాజధాని ... (మాండ్ రాగంలో).

ఈ హరికథాగానమునకు శ్రీ పాలపర్తి ఆంజనేయ శాస్త్రి గారు (అవనిగడ్డ) వాయులీనము పైన మరియు శ్రీ రాయప్రోలు సుధాకర్ గారు (ఖమ్మం) మృదంగము పైన చక్కటి సహకారము అందించారు.

చివరిగా కళాకారులను కార్యక్రమ నిర్వాహకులు నూతన వస్త్రములతో ఘనముగా చేసిన సత్కారములతో, మంగళ నీరాజనములతో ఆ నాటి కార్యక్రమము శోభాయమానంగా ముగిసినది.

# శోభాయమానంగా జరిగిన 'అన్నమయ్య సంకీర్తనామృతం' భక్తి సంగీత కార్యక్రమము

.. నేతి శ్రీనివాస్ (సాకేత్)

పవిత్ర కార్తీక మాసములో, శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవములు పురస్కరించుకొని అన్నమయ్య పరివారము, ఎస్. పి. నగర్, మౌలాలి, హైదరాబాద్; మరియు సాకేత్ హిందూ ధార్మిక సమాజ్, సాకేత్ కాలనీ, కాప్రా, హైదరాబాద్ వారి సంయుక్త నిర్వహణలో సాకేత్ గణపతి దేవాలయ ప్రాంగణములో ది. 18-11-2023 శనివారం నాడు 'అన్నమయ్య సంకీర్తనామృతం' భక్తి సంగీత కార్యక్రమము ఆసాంతము కన్నుల పండువగా జరిగినది.

అన్నమయ్య పరివారము మార్గదర్శకులు శ్రీ కందుకూరి వెంకట సుబ్రహ్మణ్యం గారు తమ తొలి పలుకులతో కార్యక్రమమును ప్రారంభించి ఆనాటి గాయని 'అన్నమయ్య సంకీర్తన చూడామణి' శ్రీమతి N. C. శ్రీదేవి గారిని, సహగాయకుడు శ్రీ ఎం. శ్రావణ్ ని, సహకార విద్వాంసులైన విద్వాన్ శ్రీ మహావాది వాసు శాస్త్రి (వయోలిన్), విద్వాన్ శ్రీ బి. జనార్దన్ (మృదంగం) మరియు విద్వాన్ శ్రీ సి. సాయి రాఘవ చరణ్ (తబలా) వారిని ఆహూతులైన రసజ్ఞ శ్రోతలకు పరిచయము చేసి వారిని సాదరముగా వేదిక మీదకు అహ్వానించారు.

'సంకీర్తన కోకిల' శ్రీమతి ఎన్. సి. శ్రీదేవి (తిరుపతి) తమ శ్రావ్యమైన మధుర గానములో ఆలపించిన అన్నమయ్య సంకీర్తనలు శ్రోతలలో ఆద్యంతమూ మధురానుభూతిని కలిగించాయి.

ఆనాటి సంకీర్తన విభావరి ముందుగా గణపతి ప్రార్థన గీతం 'నివాళించెదము' (హంసధ్వని రాగం), తదుపరి కార్తీక దామోదరుని స్మరణలో 'నమః శివాయ నటేశ్వరాయ ఉమా వరాయ నమో నమస్తే' (శుద్ధ ధన్యాసి రాగం) తో ప్రారంభమైనది.

తదుపరి శ్రీమతి శ్రీదేవి గారు 'అంతయు నీవే హరిపుండరీకాక్ష' (హిందోళ), 'నారాయణుడీతడు నరులాల' (మోహన), 'అందితిని పొందితి నీయం దఖిలభోగములు కందర్పజనక నాకు కలిగితి విన్నిటా' (సూర్యకాంతం), 'కేశవ నారాయణ కృష్ణ గోవింద ముకుంద' (హిందోళ), 'ఇట్టి వాని నన్ను' (సుమనేశరంజని), 'వచ్చెను అలమేలు మంగ' (హిందోళ), 'చిత్తజగురుడఓశ్రీనరసింహాబత్తిసేసేరు మునులు పరికించవయ్యా' (మధ్యమావతి), 'ఏడ కేడ నీ చరితలు ఏమని పొగడవచ్చు' (జంఝూటి) సంకీర్తనలు ఆలపించారు.

మధ్యలో శ్రీ ఎం. శ్రావణ్ 'అన్ని మంత్రములు ఇందే ఆవహించెను' (అమృతవర్షిణి), 'నమో నమో లక్ష్మినరసింహా నమో నమో సుగ్రీవనరసింహా' (పూర్ణచంద్రిక) కీర్తనలు గానము చేసారు.

తదుపరి శ్రీమతి శ్రీదేవి గారు 'మూల మూల నమ్ముడు చల్ల ఇది రేలు పగలు కొనరే చల్ల' (శ్రీ రాగం), 'ఇదే శిరసు మాణిక్యమిచ్చి పంపె నీకు నాకు' (రామక్రియ), 'జగన్మోహనాకార చతురుడవు పురుషోత్తముడవు' (మోహన), 'గోవింద గోవింద యని కొలువరే' (బృందావని), 'అదివో అల్లదివో శ్రీహరి వాసము' (మధ్యమావతి), 'ఎండగాని నీడగాని ఏమైనగానీ కొండలరాయడె మా కులదైవము' (జంఝూటి), 'చూడరమ్మ సతులాల సోబాన పాడరమ్మ' (మధ్యమావతి), 'ఘన రవములు ఘల్లు ఘల్లన జనుల ఎదలు ఝల్లు ఝల్లన' (మధ్యమావతి) గానామృతం చేసి చివరగా 'క్షీరాబ్ధి కన్యకకు శ్రీమహాలక్ష్మికిని' (మధ్యమావతి)

సంకీర్తనతో స్వామివారికి, ఉభయ దేవేరులకు మంగళ నీరాజనాలు అర్పించటంతో సంకీర్తన విభావరి ముగిసినది.

శ్రీమతి శ్రీదేవి గారు మంత్రమహితములైన, దివ్యమైన ఆణిముత్యాల్లాంటి సంకీర్తనలు ఎంచుకొని గానము చేయుటతోపాటు, వారి అమృత గళంలో జాలువారిన 'నారాయణుడీతడు నరులాల', 'అందితిని పొందితిని', కేశవ నారాయణ కృష్ణ గోవింద ముకుంద', 'జగన్మోహనాకార', 'గోవిందనామాలుతో' కూడి పాడిన 'అదివో అల్లదివో శ్రీహరి వాసము' వంటి సంకీర్తనలు శ్రోతలను ముగ్ధులను చేసి సంకీర్తనలు ఆస్వాదిస్తున్న ఆద్యంతము వారు స్వామివారిని, అమ్మవారిని ప్రత్యక్షంగా వీక్షించినంత మధురానుభూతిని కలుగచేసాయి.


విద్వాన్ శ్రీ మహావాది వాసు శాస్త్రి వయోలిన్ పైన, విద్వాన్ శ్రీ బి. జనార్దన్ (మృదంగం) పైన మరియు విద్వాన్ శ్రీ సి. సాయి రాఘవ చరణ్ (తబలా) పైన చక్కటి వాద్య సహకారమును అందించి శ్రోతల ప్రశంసలను అందుకొన్నారు.

ఇటువంటి మరువలేని, మరపురాని, మహితమైన (ఘన రవములు ఘల్లు ఘల్లన జనుల ఎదలు ఝల్లు ఝల్లన కీర్తనలో వర్ణించినట్లుగా) రసవత్తరమైన భక్తి సంగీత కార్యక్రమాన్ని శ్రీవారి భక్తులకు అందించిన నిర్వాహకులకు స్వామివారి కృప కటాక్షములు ఎల్లప్పుడూ దండిగా, మెండుగా ఉండాలని ఆకాంక్షిస్తూ, ఇటువంటి భక్తి కార్యక్రమములు తరచుగా జరగాలని భక్తులు కోరుకుంటున్నారు.

అనంతరం కార్యక్రమ నిర్వాహకులు కళాకారులను సత్కరించారు.

పరివారము సభ్యులు సర్వశ్రీ ఆకుండి మురళీకృష్ణ, కుసుమ గౌరి, కాండూరి శ్రీలక్ష్మి, రామ్ కుమార్, చావలి గోపాలకృష్ణ, కొండూరి పద్మావతి, వై. హిరణ్య స్నేహాంకిత, శారద గండూరి; చల్లాపల్లి గోపాలరావు (అధ్యక్షులు, సాకేత్ హిందూ ధార్మిక సమాజ్) తదితరులు కార్యక్రమములో పాల్గొన్నారు.

శ్రీ యనమండ్ర వెంకట కృష్ణయ్య (వ్యవస్థాపకులు, అన్నమయ్య పరివారము, హైదరాబాద్) వారి వందన సమర్పణముతో కార్యక్రమము దిగ్విజయముగా ముగిసినది.



1923 లో జరిగిన కాకినాడ కాంగ్రెస్ మహాసభలకు కోశాధికారిగా పనిచేసిన స్వాతంత్ర్య యోధులు స్వర్గీయ లక్కరాజుసుబ్బారావు గారి సేవలకు గాను అందించిన సేవాఫలకాన్ని కాకినాడలో డిసెంబర్ 28న జరిగిన కాంగ్రెస్ మహాసభల శతజయంతి ఉత్సవాలలో శ్రీ గిడుగు సుబ్బరాజు, శ్రీ మల్లిపూడి మంగపతి పళ్ళంరాజుల నుండి అందుకొంటున్న వారి మనుమడు, ప్రఖ్యాత సరస్వతీ గానసభ ఉపాధ్యక్షులు, రోటరీ క్లబ్ తదితర సంస్థల సేవాధురీణులు శ్రీ లక్కరాజు సత్యనారాయణ.

# విశాఖ మ్యూజిక్ అకాడమి, విశాఖపట్నం 54వ వార్షిక సంగీతనృత్యోత్సవాలు




శ్రీ S.సాకేతరామన్ (చెన్నయి). గాత్రసంగీత సభ




"సంగీతకళాసాగర" శ్రీమతి ముట్నూరి జలజాక్షి గానం

విశాఖ మ్యూజిక్ అకాడమి స్థానిక కళాభారతి (ఏ.సి) ఆడిటోరియంలో 25.11.2023 నుండి 30.11.2023 వరకు ఆరురోజులపాటు తన 54వ వార్షిక సంగీతనృత్యోత్సవాలను ఘనంగా ఎప్పటిలాగే జరుపుకుంది.

25.11.23 నాడు అనగా మొదటిరోజున వేడుకలను ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తిగా ఘనసేవలందించిన జస్టిస్ D.V.S.S. సోమయాజులు గారు జ్యోతిప్రకాశనం చేస్తూ ప్రారంభించారు. కుమారి Y. కనిష్క భక్తిప్రపత్తులతో గానంచేసిన గణపతి ప్రార్థన అనంతరం, అకాడమీ అధ్యక్షుల స్వాగతవచనాల తరువాత, ముఖ్యఅతిథి సోమయాజులుగారు తమసందేశంలో విశాఖ మ్యూజిక్ అకాడమీ విశాఖలో గత 54సం. గా అందిస్తూన్న సేవలను కొనియాడారు. ఇంత సుదీర్ఘప్రయాణంలో తమసేవలనందించిన కార్యవర్గాన్ని అభినందిస్తూ, యికముందు తానుకూడా యితోధికంగా అకాడమి కార్యక్రమాలలో పాల్గొంటానని తెలిపారు. సభానంతరం చెన్నయికి చెందిన శ్రీ సాకేతరామన్ గారి గాత్రసంగీతసభ వీనులవిందుగా జరిగింది. ఆనాటి కార్యక్రమానికి ప్రాయోజకతనందించిన శ్రీమతి టేకుమళ్ళ శ్యామలా సీతారామస్వామిగారు వేదికపై కళాకారులకు ఫలప్రదానం చేసి సత్కరించారు.

పంతువరాళిరాగంలో "సుందరతరదేహం" అంటూ సభను ఆరంభించి వరుసగా ఆనందభైరవి రాగంలో "నీకే తెలియకపోతే", అమృతవర్షిణి రాగంలో "ఆనందామృతకర్షిణి", బిలహరి రాగంలో చౌకకాలంలో నడచే "దొరకునా యిటువంటిసేవ", అరుదుగా వినే పశుపతిప్రియ రాగంలో "శరవణభవ", కీర్తనల అనంతరం "అంతర్యామీ అలసితి", "ఆకటివేళల" అన్న అన్నమయ్య రచనలతో కచేరిని ముగించేలోపు, శ్రోతల కోరికపై "అభోగి - వలజి" రాగాలలో పసందైన రాగం-తానం-పల్లవిని సుమారు అరగంటసేపు ఆలపించి శ్రోతలను రంజింపజేయడం విశేషం.

స్వల్పకాలమైనా శ్రీ సాకేతరామన్ అందించిన

రాగాలాపనలు స్వరకల్పనలు తన విద్వత్తును తెలియజేసేరీతిలో నడచి మనోరంజకములైనాయి. అపారమైన అనుభవం గలిగిన వాయులీన విద్వాంసులు శ్రీ M.S.N. మూర్తి మృదంగంపై డా. వంకాయల వేంకటరమణమూర్తి సమయోచితంగా అందించిన సహకారం ప్రేక్షకుల మన్ననల నందుకుంది. ముఖ్యంగా మూర్తిగారి రాగాలాపనలలో, స్వరకల్పనలలో ఆయనచూపిన వైదుష్యం గొప్పది. అలాగే ఘటంపై సహకరించిన శ్రీ M.హరిబాబు తో కలసి రమణమూర్తిగారు వెలయించిన లయవిన్యాసం కరతాళధ్వనులనందుకుంది.

అకాడమి ప్రతివార్షికోత్సవ వేడుకలలో వీలైనంతవరకూ సంగీత విద్యార్థులకు ప్రయోజనం చేకూర్చే లక్ష్యంతో, ఒక సోదాహరణ ప్రసంగాన్ని యేర్పాటు చేసే ప్రయత్నం చేస్తూవస్తోంది. ఈ వేడుకలలో తెలుగువారికి ఆకాశవాణి ద్వారా, తమ సంగీత సాహిత్య రచనల ద్వారా సుపరిచితులైన గతశతాబ్దపు వాగ్గేయకారులు కీ.శే. బాలాంత్రపు రజనీకాంతరావుగారి రచనలపై ఒక విహంగవీక్షణంగా సోదాహరణప్రసంగాన్ని యేర్పాటుచేసింది. రెండవరోజు 26.11.23 ఆదివారం ఉదయం 10.గం.కు, శంకరమఠం ప్రాంగణంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేసింది అకాడమీ.

"మధురయామినీ మానసవీధిలో – రజని సంగీతసాహిత్య ఈషద్దర్శనం" అన్న శీర్షికతోనే ఆకట్టుకున్న ఈ సోదాహరణ ప్రసంగాన్ని, రజనీకాంతరావుగారి సోదరులైన బాలాంత్రపు నళినీకాంతరావుగారి కుమార్తె శ్రీమతి శ్రీమతి రాంనాథ్ మరియు మనుమరాలు కుమారి శ్రేయరాంనాథ్ ఒకరు ప్రసంగిచంగా మరొకరు గానంచేస్తూ, శ్రోతలను మైమరపింపజేశారు.

"తెలుగుబాలలపల్కు తేనెసోనలచిన్కు" అంటూ గరికిపాటివారు రచించిన సరస్వతీప్రార్థన అనంతరం శ్రీ వియెస్సెన్మూర్తి రజనీకాంతరావుగారి సంగీతసాహిత్య వైదుష్యాన్ని శ్రోతలకు విపులంగా పరిచయంచేస్తూ, వారు ఒకవాగ్గేయకారునిగా రచించిన "ఆంధ్రవాగ్గేయకారచరిత్ర" గ్రంథానికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించడం, వారి రచనలను డా. మంగళంపల్లి బాలమురళీకృష్ణ, వోలేటి వేంకటేశ్వరులు, శ్రీరంగం గోపాలరత్నం, ఘంటసాల, సాలురు రాజేశ్వరరావు వంటి విద్వాంసులు ఆకాశవాణిద్వారా వినిపించడం, వారిరచన "కొండనుంచి కడలిదాకా" అన్న బాలల అంశానికి జపాన్ రేడియోనుంచి బహుమతి నందుకోవడం, వంటి విశేషాంశాలను తెలియజేశారు.

తరువాత ప్రసంగాన్ని శ్రీమతిగారు




మాండలీన్ వాద్యసభనందించిన శ్రీ U. రాజేశ్ (చెన్నయి)



సోదాహరణ ప్రసంగం సమర్పించిన
శ్రీమతి శ్రీమతి రామనాథ్ & కుమారి శ్రేయ (చెన్నయి)

ఆరంభించి సాహిత్యాంశాలను వివరిస్తూండగా, కుమారి శ్రేయ తనగానంతో అలరింపజేసింది. "మనసౌనే ఓరాధా" అన్న అలనాటి ఆకాశవాణి గీతాన్ని వీనులవిందుగా కుమారి శ్రేయ ఆలపించాక శ్రోతలు ఈలోకం మరచిపోయారన్నది వారి నిశ్శబ్దమే తెలియజేసింది. "చల్లగాలిలో యమునాతటిపై" అంటూ శ్రేయ పాటనెత్తుకోగానే అందరికీ స్వరరాజేస్వరరావు తలపుకొచ్చారంటే ఆశ్చర్యంలేదు. సాహిత్య విశేషాలను పదప్రయోగప్రయోజనాన్నీ, శ్రీమతి గారు విశ్లేషించడం వలన రజనిగారి విశ్వరూపం చూపించే ప్రయత్నం జరిగింది.

"ఎక్లాచలో ఎక్లాచలోరే" అన్నబంగాలీగీతానికి రజనిగారందించిన "కేకవిని ఎవరూరాకపోయినా ఒక్కడివె పదవోయ్" అన్న అనువాదరచన కరతాళధ్వనులనందుకుంది. బాలమురళీకృష్ణ, శ్రీరంగం గోపాలరత్నం అలనాడు ఆకాశవాణిలో గానంచేసిన "మనప్రేమ" అన్న రజని సాహిత్యాన్ని, శ్రేయ హాయిగా వినిపించారు. "ఆశా నాప్రాణసఖీ!" అంటూ వినిపించినగీతం సహకారవాద్యాలు లేనిదే పాడడం కష్టమే అయినా అలవోకగాపాడడం గాయని సాధనను తెలియజేసింది. రజనిసాహిత్యంపై విశ్లేషణ సాహితీప్రియులు వినితీరవలసినదే. రెండు గంటలకాలం తెలియకుండా గడచిపోయిందంటే అతిశయోక్తికాదు. కార్యక్రమం ముగిశాక అకాడమీ అధ్యక్షులు శ్రీ యస్వీరంగరాజన్, ఉపాధ్యక్షులు శ్రీ బి.ఎ. రాజారావు, డా. పేరాల బాలమురళీకృష్ణ, కార్యదర్శి శ్రీ యెమ్మెస్ శ్రీనివాస్ గారలు శ్రీమతి శ్రీమతి గారిని కుమారి శ్రేయను శాలువ, జ్ఞాపిక, ఫలములను అందించి సత్కరించారు. కార్యక్రమానికి బాలాంత్రపు రజనీకాంతరావుగారి కోడలు శ్రీమతి ప్రసూనగారు విజయవాడనుంచి విచ్చేసి పాల్గొనడం చెప్పుకోదగినది.

రెండవరోజు 26.11.23 నాటి సాయంత్రం అకాడమీ జుగల్బందీ వాద్యసభను వీణ – వేణు వాద్యకళాకారులచే వైవిధ్యమైన రీతిలో ఏర్పాటు చేసింది. "చెట్టుమీదకాయ – సముద్రంలో నుండే ఉప్పు"కలసిఅద్భుతరుచినందించేరీతిలో,చెన్నయికు చెందిన వీణావిదుషి శ్రీమతి నిర్మలా రాజశేఖర్, మరియు ఢిల్లీకిచెందిన మురళీవాదనాచతురులు శ్రీ చేతన్ జోషి కలసి ఆనాటి ప్రేక్షకులకు వినూత్నమైన ఆనందాన్నందించారు.

వీరిరువురి జుగల్బందీవాదనం "సంగీతానికి ప్రాంతీయభాషా భేదాలు లేవ"న్న సత్యాన్ని మరొకమారు స్పష్టంగా తెలియజేసింది. "గణేశవందన"ను మూడురాగాలలో అనగా, నాటరాగంలో "మహాగణపతిం", షణ్ముఖప్రియ రాగంలో "సిద్ధివినాయకం", హంసధ్వని రాగంలో "వాతాపి" కీర్తనలను వరుసగా వినిపించడం శ్రోతలకు వింత అనుభూతినిచ్చింది. మురళిపై త్రిస్థాయికిమించి మూడున్నర స్థాయిలను మురళి మార్చకుండా వినిపించడం శ్రీ చేతన్ జోషి ప్రత్యేకతగా క(వి)నిపించింది. తరువాత వినిపించిన "వాచస్పతిరాగ అంశం" ఇటు కర్ణాటకరీతిలో అటు




శ్రీమతి నిర్మలా రాజశేఖర్ (చెన్నయి), మరియు
శ్రీ చేతన్ జోషి (ఢిల్లీ)- జుగల్బందీ

హిందుస్తానీ రీతిలో కూడా వీనులకు విందయింది. శ్రోతలకోరికను మన్నించి యిరువురూ "ద్విజావంతి" రాగాలాపనతో "అఖిలాండేశ్వరి" కీర్తనను మనోహరమైన రీతిలో వినిపించిన అనంతరం అందరికీ పరిచయమైన "పాయోజీమైనే" భజన్ మధురంగా అందించారు. "ఠుమక్ చలత్ రామచంద్ర" అన్న భజన్ తరువాత రామదాసు రచన "యేతీరుగనను దయచూచెదవో" అంటూ, సభను ముగించారు కళాకారులు. లయవిభాగాన్ని పోషించిన శ్రీ తంజావూరు మురుగభూపతి మృదంగంపైన, శ్రీ డి. చంద్రజిత్ తబలాపైనా సరియైన అవగాహనతో సందర్భోచితమైన ప్రవేశంతో శ్రోతలను ఆకట్టుకున్నారు. ఇరువురూ అందించిన పదినిముషాల లయవిన్యాసంకూడా ప్రత్యేకతను సంతరించుకుంది.

కార్యక్రమారంభంలో, అకాడమీ పూర్వ కోశాధికారి స్వర్గీయ పి. రామారావుగారి స్మృతిలో ఆయన సతీమణి శ్రీమతి పి.వి. రాజ్యలక్ష్మి కార్యక్రమ సహప్రాయోజకులుగా కళాకారులకు ఫలప్రదానం చేస్తూ అభినందించారు. అకాడమీ శ్రీమతి రాజ్యలక్ష్మికి ధన్యవాదాలు తెలియ జేసింది.

ఈ వార్షికోత్సవాలలో విశాఖకు చెందిన ప్రసిద్ధ గాత్రవిద్వన్మణి శ్రీమతి ముట్నూరి జలజాక్షికి మూడవరోజు సంగీత కార్యక్రమారంభంలో 27.11.23 నాటి సాయంత్రం విశాఖ మ్యూజిక్ అకాడమీ ప్రతిష్ఠాత్మక "సంగీతకళాసాగర" బిరుదు సమర్పించింది. సభలో ప్రత్యేక ఆసనాన్ని గ్రహించిన శ్రీమతి జలజాక్షికి మహిళామణులు శ్రీమతి పద్మినీ శ్రీరంగం, శ్రీమతి M.K.సునీత, మరియు శ్రీమతి మాల్యాల సుభద్రలు చందన లేపనంతో పుష్పమాలాంకృతురాలిని చేయగా, వేదికపైనున్న పెద్దలు చందనమాల, శాలువ, జ్ఞాపిక ప్రఖ్యాపనపత్రము సమర్పించగా, బంగారుపతకాన్ని అకాడమీ అధ్యక్షులు శ్రీ యస్వీ రంగరాజన్ సమర్పించారు. తదుపరి నగరంలో సంగీతజ్ఞులు, రసికులు, శిష్యులు, అభిమానులు ఆమెను అభినందనలతో ముంచెత్తారు.

తరువాత జరిగిన, "సంగీతకళాసాగర" ముట్నూరి జలజాక్షి గాత్రసంగీతసభలో గాయని, విశాఖ రసజ్ఞులకు శాస్త్రీయమైన, సుశిక్షితమైన, విద్యార్థులకు శిక్షణగా ఉపయోగకరమైన సంగీతాంశాలను రెండుగంటలపాటు వినిపించి ప్రశంసలనందుకున్నారు. సురటి రాగవర్ణంతో మొదలుపెట్టి, కల్యాణిరాగంలో "ఈశపాహిమాం", బేగడరాగంలో "గట్టిగాను నను చేబట్టి", ముఖారిరాగంలో "ఏమని నే", కుంతలవరాళి రాగంలో "భోగీంద్రశాయినం" అన్న కీర్తనల అనంతరం ముఖ్యాంశంగా కాంభోజిరాగంలో "శ్రీ రఘువర అప్రమేయ" అన్న అంశాన్ని రాగాలాపన, నెరవల్, స్వరకల్పనలతో విద్వత్తును ప్రదర్శిస్తూ ప్రేక్షకుల కరతాళధ్వనులందుకున్నారు. శుద్ధధన్యాసి రాగంలో "నారాయణా" అన్న భజన వినిపించి ఝుంఝూటిరాగ తిల్లానాతో సభను సుసంపన్నం కావించారు జలజాక్షిగారు. శ్రీమతి లావణ్య రూపాకుల గాత్రసహకారాన్ని అందిస్తూ, సమయానుసారం తన నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ సభను రక్తికట్టించారు.

సుపుత్రుడు, వాయులీన విద్వాంసుడు శ్రీ ముట్నూరి శ్రీనివాస నరసింహమూర్తి వాయులీన సహకారం అందిస్తూ, గోవత్సన్యాయంగా తల్లిని అనుసరిస్తూ, తనవంతుగా తనప్రతిభను కనపరుస్తూ సభను రక్తికట్టించారు. మృదంగంపై శ్రీ కె. సద్గురుచరణ్ ఘటంపై శ్రీ యస్. హనుమంతరావు మంచి సహకారం అందించడమేకాక లయ

విన్యాసంలో తమతమ ప్రతిభను కనపరచి రసవత్తరంగా నడిపించారు.

నాలుగవరోజున అనగా 28.11.23 నాటి సాయంత్రం చెన్నయినుండి వచ్చిన మాండలిన్ విద్వాంసుడు శ్రీ యు.రాజేశ్ మాండలీన్ వాద్యసభ రసికజనరంజకంగా సాగింది. ముందుగా ఆనాటి సహప్రాయోజకులైన "సెల్ పాయింట్ (ఇండియా) లిమిటెడ్" తరఫున శ్రీ మోహన్ ప్రసాద్ పాండే గారు కళాకారులను ఫలప్రదానంతో సత్కరించారు. అకాడమీ వారికి ధన్యవాదాల నందజేసింది. బృందమంతా మద్రాసువారే కావడంతో ఒకరితో ఒకరికి చక్కనైన అనుసంధానముతో సభను ఆదినుంచి అంతంవరకూ ఒకవిధమైన వేగంతో నడిపించారనే చెప్పాలి. రాజేశ్ మధ్యమధ్యలో శ్రోతల అభిప్రాయం కోరడం, ప్రక్కవాద్య కళాకారులను ప్రోత్సహించడం ప్రేక్షకులను ఆకట్టుకుంది.

రెండున్నరగంటల కాలంలో ఒక డజను అంశాలను వినిపించి శ్రోతలను తనతోపాటు సుమారుగా పరుగెత్తించారు.

తోడిరాగవర్ణం, హంసధ్వనిలో "వాతాపి", శ్రీరంజనిలో "మారుబల్క", బిందుమాలినిలో "ఎంతముద్దో", గౌడమల్హార్ లో "సారసముఖి", చలనాటలో "ఏదయ్యాగతి", అభేరిలో "నగుమోము", కల్యాణిలో "ఏతావునరా", కాపీలో "జగదోద్ధారణ", కదనకుతూహలంలో "రఘువంశ", ఆనందభైరవిలో "పలుకే బంగారమాయెనా", సింధుభైరవిలో "వెంకటాచల నిలయం", అంశాలను వరుసగా వినిపించి చివరిలో గాంగేయభూషణి రాగంలో "ఎవ్వరే నీసరి" కీర్తన వినిపించడం విశేషం. వాయులీనంపై అనుభవజ్ఞులు శ్రీ వి.వి. శ్రీనివాసరావుగారు మాండలీన్ వాద్యానికీ దీటుగా సహకారమందించగా, మృదంగంపై డా. ప్రతిసతీశ్ కుమార్ మృదంగవాద్య ప్రియులను మైకంలో పడవేశారు తన మృదంగవాదనాపటిమతో. డా. కార్తీక్ ఘటవాద్య సహకారం ఉపపక్కవాద్యమైనా పక్కవాద్యంతో పోటీగా వినిపించిన విన్యాసాలు అద్భుతం. వీరిరువురి లయవిన్యాస ప్రదర్శనతో కళాభారతి దద్దరిల్లిపోయింది.

అయిదవరోజు అనగా 29.11.23 నాటి సాయంత్రం సరిగ్గా 6.30 గం కు ఆరంభమైన చెన్నయికు చెందిన శ్రీమతి అమృతా వెంకటేశ్ గారి గాత్రసంగీతసభ ఆసాంతం ఆపాతమధురంగా సాగింది. మంగళంపల్లి బాలమురళీకృష్ణగారు రచించిన గంభీరనాట పదవర్ణం "అమ్మా ఆనందదాయిని" అంటూ గంభీరంగా ఆరంభించిన గాయని చివరివరకూ శ్రోతలను ఆనందసాగరంలో ముంచెత్తారు. బేగడ రాగంలో "శంకరినీవే", వసంతరాగంలో "వాడేవెంకటాద్రి" అన్న అన్నమయ్యరచన, లతాంగి రాగంలో "మరివేరెదిక్కెవరు", అన్న కీర్తనలను సుమధురమనోహరంగా ఆలపించి ముఖ్యాంశంగా ఖరహరప్రియ రాగంలో "ప్రక్కలనిలబడి" కీర్తనను తనదైన శైలిలో రాగాలాపన, నెరవల్,స్వరకల్పనలతో శ్రోతలను మైమరపింపజేశారు.

లయవిన్యాసం తరువాత గానంచేసిన "బేహాగ్" రాగంలో రామదాసు రచన "హరిహరి రామనామ నన్నరమరసేయకు", సింధుభైరవి రాగంలో "విశ్వేశ్వర దర్శన్ కర్" భజన, యమన్ కల్యాణ్ రాగంలో పురందరదాసపదం "కొలలనూదుత బంద", అన్న అంశాలు అలవోకగా వినిపించిన శ్రీమతి అమృత వెంకటేశ్ బాలమురళి రచించిన ద్విజావంతిరాగ తిల్లానాతోనే ముగించడం విశేషం.

శ్రీ L. రామకృష్ణన్ వాయులీన సహకారం

గానానికి మరింత మాధుర్యం చేకూర్చగా, శ్రీ S.J. అర్జున్ గణేశ్ మృదంగ సహకారమూ, లయ విన్యాసము శ్రోతల మనసులో నిలచిపోయేరీతిలో మంచి గతులతో సంగతులతో ముక్తాయిలతో అలరించింది. అకాడమీ వార్షికోత్సవాలలో సంగీత సభలకు మంచి ముగింపును చేకూర్చి మరునాటి నృత్యకార్యక్రమానికి తెరతీసింది.

చివరిరోజైన 30.11.23 నాటి సాయంత్రం ప్రొ. జొన్నలగడ్డ అనురాధ గారి రూపకల్పన, నృత్యదర్శకత్వంలో "ఆర్ట్ ఇండియా ఫౌండేషన్ హైదరాబాదు" వారు అందించిన నృత్యాంశాలు ప్రేక్షకుల హృదయాలలో నయనానందకరంగా నిలచిపోయాయి.

ఈ అంశం ఆరంభమవడానికి ముందుగా అకాడమీ ప్రతియేటా సంగీతకళాకారులకు అందించే బహుమతులనుఆనాటి విశిష్టఅతిథి కవి,పండితులు, శతావధాని శ్రీ బేతవోలు రామబ్రహ్మంగారు మరియు ఆనాటి కార్యక్రమ ప్రాయోజకులు, శ్రీప్రకాష్ విద్యానికేతన్ సంచాలకులు, శ్రీ వాసుప్రకాశ్ చిట్టూరి వారి హస్తాలమీదుగా అందీయడం జరిగింది. ఆ సందర్భంగా సభను నిర్వహించిన శ్రీ వి.యస్. మూర్తి స్వాగతవచనాలు, అతిథుల పరిచయాల అనంతరం అకాడమి ఒకముఖ్యమైన కార్యక్రమం నిర్వహించింది. వార్షికోత్సవ వేడుకలలో ప్రతియేటా నిరంతర నిస్వార్థ సేవలందిస్తూన్న కార్యవర్గ సభ్యులలో ఒకరికి కృతజ్ఞతాసూచకంగా చిరు సన్మానం చేయడం తనబాధ్యతగా అకాడమీ భావిస్తూవస్తోంది. ఈ యేడాది తమ అధ్యక్షస్థానంలో ఎనలేని సేవలనందించిన శ్రీ యస్వీ రంగరాజన్ గారిని సన్మానించుకోవాలని అకాడమి నిర్ణయించింది. రంగరాజన్ గారిని ప్రేక్షకులకు అతిథులకు గౌరవసూచకంగా పరిచయం చేస్తూ శ్రీ వి.యస్.యన్.మూర్తి, అధ్యక్షస్థానం రంగరాజన్ చేబట్టాక అకాడమీ సాధించిన పురోభివృద్ధి గురించి, రంగరాజన్ అకాడమీని నడిపించిన తీరుగురించి, అంతేకాక వృత్తిరీత్యా NSTL Director హోదాలో ఆయన సాధించిన ప్రగతిగురించి వివరంగా తెలియజేశారు.

తరువాత ప్రత్యేక ఆసనంపై ఆశీనులైన రంగరాజన్ గారిని, విశిష్ట అతిథి శ్రీ బేతవోలు రామబ్రహ్మంగారు శాలువతో సత్కరించిన పిదప, శ్రీ బి.ఎ.రాజారావుగారు పూలమాలను, డా.పేరాల బాలమురళీకృష్ణ గులాబీపూలగుచ్చాన్ని అందించిన తరువాత, ముఖ్య అతిథి శ్రీ వాసుప్రకాశ్ జ్ఞాపికను సమర్పించారు. గౌరవసూచకంగా అకాడమీ కార్యవర్గ సభ్యులందరూ తమ అభిమానాన్ని గులాబీలద్వారా తెలియజేయడం విశేషం. శ్రీ రంగరాజన్ తనస్పందనను తెలియజేసినతరువాత అకాడమీ ప్రతీయేటా సమర్పిస్తూన్న "Art-ist of distinction" అవార్డును ప్రత్యేక ఆసనం స్వీకరించిన కుమారి కొమ్మాజోస్యుల ఆలేఖ (ప్రఖ్యాత మార్దంగికులు శ్రీ కె. సద్గురుచరణ్ సుపుత్రిక) కు ప్రోత్సాహసూచకంగా అందించింది. ఈ అవార్డురూపంలో శాలువ, జ్ఞాపిక, ఫలములు



**విశాఖ మ్యూజిక్ అకాడమీ "Artist of Distinction" అవార్డును అకాడమీ వార్షికోత్సవాలలో అందుకుంటూన్న కుమారి ఆలేఖ.**

మరియు పదివేలరూపాయల నగదును అకాడమీ సమర్పించింది. ఈ అవార్డుకు ప్రాయోజకతను చేకూర్చిన శ్రీ చిట్టూరి వేణుగోపాల శర్మగారి మనుమరాలు శ్రీమతి సత్యవతి, ఆమెభర్త డా. కనుపర్తి సత్యనారాయణమూర్తి గారిద్వారా నగదు బహుమతిని అందజేయడం జరిగింది. వీరికి అకాడమీ ధన్యవాదాలు తెలుపుకుంటోంది. తదుపరి అకాడమీ నిర్వహించిన యువకళాకారుల సంగీతసభలలో ఉత్తమసభను అందించిన కుమారి కె. నాగవైష్ణవికి ఫలములను, జ్ఞాపికను నగదు బహుమతిని అందజేసింది అకాడమీ. అలాగే ఆ సభలలో పాల్గొని రసజ్ఞులను ఆనందపరచిన కుమారి భమిడిపాటి వీణాధరి, కుమారి యివటూరి కృష్ణశృతి, శ్రీ అనుజ్ కాజ, శ్రీ PVS బాలాజీ యువరాజ్, శ్రీ సాయి కేశవ్ సబేశన్ గారలకు ఫలములు, జ్ఞాపిక మరియు నగదు బహుమతులను అందించి ప్రోత్సహించింది అకాడమీ. ఈ బహుమతులకు ప్రాయోజకతను చేకూర్చిన శ్రీమతి Y.V.M. జయశ్రీగారికి, ములుకుట్ల కుటుంబ సభ్యులకు, శ్రీ Ch. దుర్గాప్రసాద్ గారికీ అకాడమీ ధన్యవాదాలు తెలియజేసుకుంటోంది. విశిష్ట అతిథి శ్రీ బేతవోలు రామబ్రహ్మంగారు, మరియు ముఖ్య అతిథి శ్రీ వాసు ప్రకాశ్ గారల సందేశానంతరం సభముగిసింది. నృత్యకార్యక్రమానికి ప్రాయోజకతనందించిన Sri Prakash Educational Society సంచాలకులు శ్రీ వాసుప్రకాశ్ గారికి అకాడమీ ధన్యవాదాలు సమర్పించుకుంది.

తరువాత జరిగిన నృత్యకార్యక్రమంలో ప్రొ. అనురాధ జొన్నలగడ్డ గారి కొరాయోగ్రఫీలో నర్తకీమణులు శ్రావ్య సుబ్రమణ్యం, మేఘ విజయన్, G.P.గోపిక, K. శ్రీలక్ష్మి, అపర్ణ అరుణకుమార్, మహిత దేవులపల్లి మూడు నృత్యాంశాలను వరుసగా ప్రదర్శించారు. ముందుగా చక్రవాకరాగంలో గజాననయుతం అన్న దీక్షితులవారి కృతితో విఘ్నవినాశకుని దీవెనలు కోరుకొని, నారాయణతీర్థులవారి కృష్ణలీలాతరంగిణి నుంచి "వీక్షేకద దేవదేవం" అంటూ రాగమాలికలో, తాళమాలికగా కృష్ణలీలలను ప్రదర్శించి, ఖమాస్ రాగ తిల్లానాను నర్తించి ప్రేక్షకులను ఆనందపరిచారు. తరువాత ఆనాటి కార్యక్రమ ముఖ్యాంశం "డాన్స్ బాలే – మహాకాళి" అన్న నృత్యాంశాన్ని మొట్టమొదటిసారిగా విశాఖ ప్రేక్షకుల కోసమే సంపూర్తిగా ప్రదర్శిస్తున్నామన్న ప్రొ. అనురాధగారి మాటలకు ప్రేక్షకులు ఉప్పొంగిపోయారు. ప్రొ. అనురాధ జొన్నలగడ్డ, అపర్ణ అరుణ్ కుమార్, కాత్యాయని కనక్, P.B.వైష్ణవి, అనుష శ్రీనివాస్, నర్తకీమణులతోపాటు ప్రత్యేక పాత్రలలో నర్తకులు శీనయ్య బక్కి, ప్రవీణ్ వొగ్గు, చూపిన నర్తనప్రతిభ అద్వితీయం. శ్రీబసవరాజు బృందం లైటింగ్, శ్రీ సుదర్శన్ ఆహార్యం, శ్రీ D.S.V. శాస్త్రీ సంగీతం సమకూర్చగా "మంహంకాళి" నృత్యరూపకం ఒక ప్రత్యేకతను సంతరించుకుంది.

దేవి సప్తశతి, దేవి భాగవతంనుండి ప్రేరణను తీసుకొని కాలస్వరూపమైన మహంకాళి, లోకాలలో వికృతరూపం ధరించి, స్వార్థం, ధనం, అధికారమదం, పైశాచిక తాండవంచేస్తున్నవేళ ఆయా రూపాలను సమూలంగా నాశనంచేయడానికి లోకాలనన్నింటినీ తనలో ఐక్యంచేసుకొని మరల పునః సృష్టి చేసే విధానం అరగంట కాలంలో అద్భుతంగా ప్రదర్శించగలిగారు బృందసభ్యులు. ముఖ్యంగా నర్తకులిరువురు ప్రదర్శించిన ఆసురీశక్తుల విజృంభణకు జేజేలు.

అంశం ప్రతి "ఫ్రేమ్ "లో అనురాధగారి

కొరియోగ్రఫీ ప్రతిభ కనుపిస్తూనే ఉంది. పాత్రలకు తగిన అభినయాన్ని ఆయా నర్తకులచే చేయించడం విశేషం. విశిష్ట అతిథి శ్రీ బేతవోలు రామబ్రహ్మంగారు తన సమీక్షలో నృత్యం అనేది భరతముని, సిద్ధేంద్రయోగి నిర్వచించినట్లు, ఒకయోగమన్నది సత్యం. ఆయన అన్నట్లుగా వారి నృత్యం వీక్షించడానికి ప్రేక్షకులకు రెండుకళ్ళూ చాలలేదంటే అతిశయోక్తికాదు. భావానికి తగిన రూపకల్పన ఒకప్రక్క అనూరాధగారు చూపుతూండగా మరొకప్రక్క యిద్దరు నర్తకీమణులు దానికి తగిన వివరణలనందించడం గొప్ప కొరియోగ్రఫీకి నిదర్శనం. రామబ్రహ్మంగారన్నట్లు ఆప్రదర్శన మేథావి వర్గంకోసం రూపకల్పన చేశారేమో అన్నంత ఉత్తమంగా నడచింది. నర్తనంలో పూర్వపు సాంప్రదాయముద్రలు చాలక కొత్తముద్రలను సందర్భోచితంగా ప్రదర్శించడం ప్రజ్ఞకు ఉదాహరణ.

అంతకుముందు సోలో ప్రదర్శనలలో తరంగంలో "యతోదృష్టిః తతోభావః" అన్న మూలసూత్రాన్ని ప్రత్యక్షంగా దర్శింపజేశారందరూ. కృష్ణపరమాత్మను సినిమాకృష్ణునిలాకాకుండా "సిద్ధసన్నుతచారుశీలం"అన్ననారాయణతీర్థులవారి మనస్సుని గ్రహించి కృష్ణుని నుతించడంలో కృష్ణపరబ్రహ్మగా చూపడం విశేషం. యిలా ఎన్నో విషయాలను నృత్యవిశేషాలను విశ్లేషిస్తే, విశ్లేషణ ఏరీతిలో సాగాలో తెలియజేసిన శ్రీ బేతవోలు రామబ్రహ్మంగారికి అకాడమీ ధన్యవాదాలు మరొక్కమారు తెలుపుకుంటోంది. ఆయన చేతులమీదుగా అందరికీ సన్మానం జరిపించిన తరువాత అకాడమీ ఈ వేడుకలు ముగిసినట్లు ప్రకటిస్తూ ప్రాయోజకులందరికీ ధన్యవాదాలు తెలుపుకుంది.

ప్రతిరోజు కార్యక్రమాన్ని తన ప్రారంభ పలుకులతో ఆహ్వానములతో సభానిర్వహణతో శ్రీ వి.యెస్.యెన్.మూర్తి ఆరంభించగా, శ్రీమతి Y. లక్ష్మీప్రభ, శ్రీమతి M.K. సునీత గారలు కళాకారుల పరిచయాలను సమర్పించగా, చక్కనైన సభానంతర సమీక్షలను యథావిధిగా డా. పేరాల బాలమురళీగారు అందించి వేడుకలు సజావుగా సమయబద్ధంగా జరుగడానికి దోహదపడడం విశేషం. అధ్యక్షులు శ్రీ యస్వీ రంగరాజన్, కార్యదర్శి శ్రీ యమ్మెస్ శ్రీనివాస్, ఉపాధ్యక్షులు శ్రీ బి.ఎ.రాజారావు, డా. పేరాల బాలమురళీకృష్ణ, సహకార్యదర్శులు శ్రీ టి.కృష్ణారావు, శ్రీ అయ్యగారి భుజంగరావు, కోశాధికారి శ్రీ వీరఘంట చంద్రశేఖర్ గారలు ఎవరిపాత్రలను వారు తగినరీతిలో పోషించగా, కార్యవర్గసభ్యులు శ్రీ జ్వాలాప్రసాద్, శ్రీ M.M.ప్రభు, శ్రీ జ్యోతిస్వరూప్, శ్రీ రమేష్ తదితరులు వెన్నుదన్నుగా నిలచి శ్రమించడంతో అకాడమీ 54వ వార్షికోత్సవాలు సుసంపన్నమయ్యాయి. తన ఆరోగ్యం సహకరించకపోయినా, అకాడమీ ఛీఫ్ పాట్రన్ డా. సూరపనేని విజయకుమార్ గారు ప్రతిరోజు కార్యక్రమంలో పాల్గొనడం బహుదా ప్రశంసనీయం. ఆరురోజులపాటు వదాన్యుల ఆర్థికసహాయంతో, కళాకారుల సహృదయతతో, హాలునిండిన ప్రేక్షకుల ప్రోత్సాహంతో, వేడుకలు ఘనంగా జరగడమేకాక రసజ్ఞుల హృదయాలలో అకాడమీకి సుస్థిరమైన స్థానాన్ని సంపిదించిపెట్టాయన్నది తిరుగులేనిసత్యం.

**- వియెస్సెన్మూర్తి**

విశాఖ మ్యూజిక్ అకాడమీ.

# శోభాయమానంగా జరిగిన 'అన్నమయ్య సంకీర్తనామృతం' భక్తి సంగీత కార్యక్రమము

- నేతి శ్రీనివాస్ (సాకేత్)






పవిత్ర కార్తీక మాసములో, శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవములు పురస్కరించుకొని అన్నమయ్య పరివారము, ఎస్. పి. నగర్, మౌలాలి, హైదరాబాద్; మరియు సాకేత్ హిందూ ధార్మిక సమాజ్, సాకేత్ కాలనీ, కాప్రా, హైదరాబాద్ వారి సంయుక్త నిర్వహణలో సాకేత్ గణపతి దేవాలయ ప్రాంగణములో ది. 18-11-2023 శనివారం నాడు 'అన్నమయ్య సంకీర్తనామృతం' భక్తి సంగీత కార్యక్రమము ఆసాంతము కన్నుల పండువగా జరిగినది.

అన్నమయ్య పరివారము మార్గదర్శకులు శ్రీ కందుకూరి వెంకట సుబ్రహ్మణ్యం గారు తమ తొలి పలుకులతో కార్యక్రమమును ప్రారంభించి ఆనాటి గాయని 'అన్నమయ్య సంకీర్తన చూడామణి' శ్రీమతి N. C. శ్రీదేవి గారిని, సహగాయకుడు శ్రీ ఎం. శ్రావణ్ ని, సహకార విద్వాంసులైన విద్వాన్ శ్రీ మహావాది వాసు శాస్త్రి (వయోలిన్), విద్వాన్ శ్రీ బి. జనార్ధన్ (మృదంగం) మరియు విద్వాన్ శ్రీ సి. సాయి రాఘవ చరణ్ (తబలా) వారిని ఆహూతులైన రసజ్ఞ శ్రోతలకు పరిచయము చేసి వారిని సాదరముగా వేదిక మీదకు అహ్వానించారు.

'సంకీర్తన కోకిల' శ్రీమతి ఎన్. సి. శ్రీదేవి (తిరుపతి) తమ శ్రావ్యమైన మధుర గానములో ఆలపించిన అన్నమయ్య సంకీర్తనలు శ్రోతలలో ఆద్యంతమూ మధురానుభూతిని కలిగించాయి.

ఆనాటి సంకీర్తన విభావరి ముందుగా గణపతి ప్రార్థన గీతం 'నివాళించెదము' (హంసధ్వని రాగం), తదుపరి కార్తీక దామోదరుని స్మరణలో 'నమః శివాయ నటేశ్వరాయ ఉమా వరాయ నమో నమస్తే' (శుద్ధ ధన్యాసి రాగం) తో ప్రారంభమైనది.

తదుపరి శ్రీమతి శ్రీదేవి గారు 'అంతయు నీవే హరిపుండరీకాక్ష' (హిందోళ), 'నారాయణుడీతడు నరులాల' (మోహన), 'అందితిని పొందితి నీయం దఖిలభోగములు కందర్పజనక నాకు కలిగితి విన్నిటా' (సూర్యకాంతం), 'కేశవ నారాయణ కృష్ణ గోవింద ముకుంద' (హిందోళ), 'ఇట్టి వాని నన్ను' (సుమానేశరంజని), 'వచ్చెను అలమేలు మంగ' (హిందోళ), 'చిత్తజగురుడఓశ్రీనరసింహాబత్తిసేసేరు మునులు పరికించవయ్యా' (మధ్యమావతి), 'ఏడ కేడ నీ చరితలు ఏమని పొగడవచ్చు' (జంఝూటి) సంకీర్తనలు ఆలపించారు.

మధ్యలో శ్రీ ఎం. శ్రావణ్ 'అన్ని మంత్రములు

ఇందే ఆవహించెను' (అమృతవర్షిణి), 'నమో నమో లక్ష్మినరసింహా నమో నమో సుగ్రీవనరసింహా' (పూర్ణచంద్రిక) కీర్తనలు గానము చేసారు.

తదుపరి శ్రీమతి శ్రీదేవి గారు 'మూల మూల నమ్ముడు చల్ల ఇది రేలు పగలు కొనరే చల్ల' (శ్రీ రాగం), 'ఇదే శిరసు మాణిక్యమిచ్చి పంపె నీకు నాకు' (రామక్రియ), 'జగన్మోహనాకార చతురుడవు పురుషోత్తముడవు' (మోహన), 'గోవింద గోవింద యని కొలువరే' (బృందావని), 'అదివో అల్లదివో శ్రీహరి వాసము' (మధ్యమావతి), 'ఎండగాని నీడగాని ఏమైనగానీ కొండలరాయడె మా కులదైవము' (జంఝూటి), 'చూడరమ్మ సతులాల సోబాన పాడరమ్మ' (మధ్యమావతి), 'ఘన రవములు ఘల్లు ఘల్లన జనుల ఎదలు ఝల్లు ఝల్లన' (మధ్యమావతి) గానామృతం చేసి చివరగా 'క్షీరాబ్ధి కన్యకకు శ్రీమహాలక్ష్మికిని' (మధ్యమావతి) సంకీర్తనతో స్వామివారికి, ఉభయ దేవేరులకు మంగళ నీరాజనాలు అర్పించటంతో సంకీర్తన విభావరి ముగిసినది.

శ్రీమతి శ్రీదేవి గారు మంత్రమహితములైన, దివ్యమైన ఆణిముత్యాల్లాంటి సంకీర్తనలు ఎంచు కొని గానము చేయుటతోపాటు, వారి అమృత గళంలో జాలువారిన 'నారాయణుడీతడు నరులాల', 'అందితిని పొందితిని', 'కేశవ నారాయణ కృష్ణ గోవింద ముకుంద', 'జగన్మోహనాకార', 'గోవిందనామాలుతో' కూడి పాడిన 'అదివో అల్లదివో శ్రీహరి వాసము' వంటి సంకీర్తనలు శ్రోతలను ముగ్ధులను చేసి సంకీర్తనులు ఆస్వాదిస్తున్న ఆద్యంతము వారు స్వామివారిని, అమ్మవారిని ప్రత్యక్షంగా వీక్షించినంత మధురానుభూతిని కలుగచేసాయి.

విద్వాన్ శ్రీ మహావాది వాసు శాస్త్రి వయోలిన్ పైన, విద్వాన్ శ్రీ బి. జనార్దన్ (మృదంగం) పైన మరియు విద్వాన్ శ్రీ సి. సాయి రాఘవ చరణ్ (తబలా) పైన చక్కటి వాద్య సహకారమును అందించి శ్రోతల ప్రశంసలను అందుకొన్నారు.

ఇటువంటి మరువలేని, మరపురాని, మహితమైన (ఘన రవములు ఘల్లు ఘల్లన జనుల ఎదలు ఝల్లు ఝల్లన కీర్తనలో వర్ణించినట్లుగా) రసవత్తరమైన భక్తి సంగీత కార్యక్రమాన్ని శ్రీవారి భక్తులకు అందించిన నిర్వాహకులకు స్వామివారి కృప కటాక్షములు ఎల్లప్పుడూ దండిగా, మెండుగా ఉండాలని ఆకాంక్షిస్తూ, ఇటువంటి భక్తి కార్యక్రమములు తరచుగా జరగాలని భక్తులు కోరుకుంటున్నారు.

అనంతరం కార్యక్రమ నిర్వాహకులు కళా కారులను శాలువలతో ఘనముగా సత్కరించారు.

పరివారము సభ్యులు సర్వశ్రీ ఆకుంది మురళీకృష్ణ, కుసుమ గౌరి, కాండూరి శ్రీలక్ష్మి, రామ్ కుమార్, చావలి గోపాలకృష్ణ, కొండూరి పద్మావతి, వై. హిరణ్య స్నేహాంకిత, శారద గండూరి; చల్లాపల్లి గోపాలరావు (అధ్యక్షులు, సాకేత్ హిందూ ధార్మిక సమాజ్) తదితరులు కార్యక్రమములో పాల్గొన్నారు.

శ్రీ యనమండ్ర వెంకట కృష్ణయ్య (వ్యవస్థాపకులు, అన్నమయ్య పరివారము, హైదరాబాద్) వారి వందన సమర్పణముతో కార్యక్రమము దిగ్విజయముగా ముగిసినది.

# శ్రీ త్యాగరాజ సాంస్కృతిక సంఘం, గుంటూరు




శ్రీత్యాగరాజ సాంస్కృతిక సంఘం–గుంటూరు ఆధ్వర్యంలో డిశంబరు 10వతేది లక్ష్మీపురంలోని వారి స్వంత భవనంలో శ్రీకృష్ణరామరత్ని మ్–ఆస్ట్రేలియా వారి సంగీత కచేరీ ధాటిగా సాగింది.రెండున్నర శృతిలో స్ఫుటంగా గంభీరం గా పాడుతుంటే శ్రోతలు వేరు ఆలోచన లేక కచేరీలో తన్మయులయ్యారు. గజాననయుతం; వేణుగానలోలుని; ఆనందభైరవి లో మరివేరెగతి; భోగీంద్ర శాయినం; అఖిలాండేశ్వరి; శ్రీరంజనిలో భువినిదాసుడనే రాగం, స్వరం ; కల్యాణి ప్రధాన అంశంగా. ఏతావునరా కీర్తన విస్తృతంగా వినిపించి; భక్తి కొలదివాడే; వగలాడి బోధనలకు జావళి; పూర్ణచంద్రికలో రామ్నాడ్ శ్రీనివాస అయ్యర్ తిల్లానా లతో ముగించారు. విద్వాంసులైన పలువురు గరువులదగ్గర శిష్యరికం చేసిన వీరు తనదైన మనోధర్మంతో కచేరిని ఆసాంతం రక్తికట్టించారు. సర్వశ్రీ ఆర్.దినకర్; పి.జయభాస్కర్; లక్ష్మీశంకర్ (మోర్సింగ్) సహకారాలు కచేరి స్థాయిని నిలబెట్టాయి.కార్యదర్శి శ్రీనేతి విశ్వేశ్వరరావు కళాకారులపరిచయంచేయగా సహకార్యదర్శి శ్రీ గిరిజాశంకర్ వందనసమర్పణ చేశారు.కమిటీ సభ్యులు సంగీత ప్రియులు విశేషంగా పాల్గొన్నారు.

**- గానకళ ప్రత్యేక ప్రతినిధి.**




సద్గురు సన్నిధి రాజమండ్రిలో శ్రీ ఆకొండి శ్రీనివాసరాజారావు గాత్ర సంగీత సభ శ్రీ హెచ్. రామచరణ్, శ్రీ మంగళగిరి శ్రీధర్ సహకారాలు.



సద్గురు సన్నిధి రాజమండ్రిలో శ్రీమతి వై. శిఖామణి భాగవతారిణి– హరికథ శ్రీ కె.టి. సుబ్బరాయన్ – వయలన్, కె. సూరిబాబు – మృదంగం సహకారాలు.



మృదంగ బాగుసేతల కళాకారులు హైదరాబాద్ వాసి శ్రీ భాస్కర్ ను విజయదశమి సందర్భంగా సత్కరించిన మృదంగ విశారదులు శ్రీ శ్రీనివాసగోపాలన్ పరవస్తు. భాస్కర్ తాతగారు శ్రీ భాష్యకారులు; తండ్రి శ్రీ లోయరాజు ఇదే సేవలో తరించిన విషయం సంగీతలోకానికి ఎఱుకే!




సద్గురు సన్నిధి రాజమండ్రిలో అయ్యగారి సత్యప్రసాద్ దంపతుల వీణాయుగళం

# సద్గురు సన్నిధి, రాజమండ్రి




సద్గురు సన్నిధి, రాజమండ్రి వారి నిర్వహణలో 5.11.2023న రాజమండ్రిలో శ్రీ సరస్వతుల హనుమంతరావు హరికథా కాలక్షేపం.




సద్గురు సన్నిధి,రాజమండ్రి వారి నిర్వహణలో 5.11.2023న రాజమండ్రిలో శ్రీమతి అనువ్రతా నరసింహన్ గాత్రసభ. సరస్వతుల పార్థివ-వైలన్; మంగళగిరి శ్రీధర్-మృదంగం.

# సంగీత జగద్గురు సేవా సమితి, తెనాలి





రామలింగేశ్వరపేటలోని శ్రీ దుర్గా పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి దేవస్థాన ప్రాగణంలో 11-11-2023. శనివారం, సాయంత్రం 6. గంటల నుండి 8. 30.గంటల వరకు, పై సభవారి ఆధ్వర్యంలో, సంగీత త్రిమూర్తుల లో ఒకరైన "శ్రీ ముత్తుస్వామి దీక్షిత్ వారి" వర్ధంతి సందర్భంగా సంగీత సాహిత్య ప్రవీణ శ్రీ యనమండ్ర శ్రీనివాస్ శర్మ శ్రీ ముత్తుస్వామి దీక్షిత్ గారి గురించి సోదాహరణ ప్రసంగం లో ముత్తుస్వామి దీక్షిత్ వారి జీవిత చరిత్ర మరియు వారు సంగీతానికి చేసిన సేవ గురించి విశేషంగా చెప్పారు. ముత్తుస్వామి దీక్షిత్ గారి పలు సంగీత కీర్తనలు ఆలపించారు. వైలన్ పై శ్రీ చావలి శ్రీనివాస్ విజయవాడ; మృదంగంపై శ్రీ కానూరి వెంకట రామకృష్ణ - తెనాలివారు వాయిద్య సహకారం అందించారు.

అనంతరం సభతరఫున, శ్రీమతి డాక్టర్ చింతలపాటి మంజుల యనమండ్ర శ్రీనివాస్ శర్మ గారిని ఘనంగా సత్కరించినారు. ఈ కార్యక్రమంలో పర్చూరు సుబ్బారావు, కొండపి శ్రీనివాసరావు, ఎస్పీ చంద్రశేఖర్, నల్లూరు శ్రీనివాస్ మరియు తెనాలి సంగీత ప్రియులు సంగీత గురువులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని డాక్టర్ చింతలపాటి మంజుల పర్యవేక్షించారు.

# సరస్వతీ గానసభ - కాకినాడ







సరస్వతీ గానసభ–కాకినాడ వారి 120వ వార్షిక సంగీత, నృత్య, నాటకోత్సవాల లో రెండవ విడత కార్యక్రమాలు కాకినాడ సూర్యకళా మందిరంలోజరిగాయి. కలైమామణి శ్రీ మాధవపెద్ది మూర్తి, చెన్నై మరియు బృందం వారిచే కూచిపూడి నృత్య ప్రదర్శన 2.12.23 న జరిగింది.

త్యాగరాజ స్వామి వారి పంచరత్న కీర్తన జగదానందకారక కీర్తనతో ప్రారంభించి, జయదేవుని అష్టపది, అన్నమాచార్యులవారి తందనాన తిల్లాన మొదలైన అంశాలతో అలరించారు. సహ కార్యదర్శి శ్రీ చెరుకువాడ సత్యనారాయణ కళాకారులను పరిచయం చేశారు.సంకురాత్రి ఫౌండేషన్ తరఫున స్వర్గీయ శ్రీమతి మంజరి, కిరణ్, శారదల సంస్మరణగా పద్మశ్రీ డా.సంకురాత్రి చంద్రశేఖర్ ఈకార్యక్రమాన్ని సమర్పించారు.

రెండవ రోజు3.12.2023న సంగీత కళానిధి శ్రీమతి సుధారఘునాథన్, చెన్నై, వారి గాత్ర కచేరి రక్తిగా జనాకర్షణతో జరిగింది. అధ్యక్షులు శ్రీ కె.వి.ఎస్.ఆంజనేయమూర్తి స్వాగతం పలుకుతూ సభాకార్యక్రమాలను వివరించారు. కార్యదర్శి శ్రీ పేపకాయల రామకృష్ణ కళాకారులను పరిచయంచేశారు.

హరికేశనల్లూర్ ముత్తయ్య భాగవతార్ గారి ఖమాస్ రాగ 'మాతే మలయధ్వజ' దరు వర్ణం తో ప్రారంభించి, మళవై చిదంబర భారతి గారి హంసధ్వని రాగ "పాహి పాహి గణపతే", బౌళి రాగంలో శ్రీమన్నారాయణ, మామవతుశ్రీ మొదలైన కీర్తనలు గానం చేసి మెప్పించారు.



వీరికి వయోలిన్ పై ఎంబర్ కణ్ణన్, మృదంగం పై అక్షయ అనంత పద్మనాభన్ మరియు ఘటంపై ఆర్. రామన్; తంబురాలపై శిష్యులు కుమారీలు డా.సర్వేపల్లి శ్రేయ, డా.రాజ్యలక్ష్మి(నెల్లూరు) సహకారాన్ని అందించారు. డా.ఐ.వి.జోగారావు శ్రీమతి నాగమణి దంపతుల సంస్మరణగా శ్రీమతి రాజ్యలక్ష్మి, డా. ఇవటూరి సన్యాసి రాజు ఈకార్యక్రమాన్ని సమర్పించారు.

మూడవరోజు కుమారి సూర్యగాయత్రి (కాలికట్) భక్తి సంగీత మాలిక కార్యక్రమం విశేషంగా ఆకర్షించింది. తుఫాను వాతావరణం నెలకొన్నా శ్రోతలతో సభాస్థలి నిండిపోయింది. వైలన్ పై పి.వి.సునీల్ కుమార్; పివి.అనిల్ కుమార్– మృదంగం; ఎస్.ప్రశాంత్ – కాలికట్– తబలపై సహకరించారు.




13 సంవత్సరాల చిరంజీవి గరికపాటి జగన్నాథ్ రామ్ (USA)గాత్రకచేరీప్రతిభావంతంగాసాగింది.”స్వరఝరి” సంస్థ విజయవాడ రామకోటిలో 9–1–2024 న నిర్వహించిన ఈ కార్యక్రమానికి A గ్రేడ్ విద్వాంసులు అయిన శ్రీ వేదుల శ్రీకిరణ్ వాయులీనం తోను,శ్రీ మంగళగిరి శ్రీధర్ మృదంగంతోను చక్కని సహకారాలు అందించారు. ఎంతో కష్టతరమైన భైరవి రాగం– తానం– పల్లవిని రాగ,తాళ మాలికగా శ్రోతల ముందు ప్రదర్శించిన తీరు అందరి మన్ననలు అందుకుంది.వయస్సుకు మించిన పరిణతి చూపిన చిరంజీవి జగన్నాథ్ కు ఉజ్జ్వలమైన భవిష్యత్ ఉంది అనటంలో అతిశయోక్తి లేదు.

– Dr Sudhakar Modumudi



## ప్రపంచ మధుమేహ దినోత్సవం


సందర్భంగా కేర్ హాస్పిటల్, హైదరాబాద్ వారి ఆధ్వర్యం లో 14.11.23 న లలిత సంగీతం, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి, పిల్లలకు బహుమతులు ప్రదానం చేసేరు. శ్రీమతి రాధ నిర్వహణ లో డా.అసఫక్ హుస్సేన్, డా.సరస్వతి పాల్గొని బహుమతి ప్రదానం చేసేరు.హృద్రోగ నిపుణులు డా.సూర్య ప్రకాష్, డా.శ్రీలత ద్వారం, శ్వాసకోశ నిపుణులు డా. సయ్యద్ అబ్దుల్ అలీమ్ కార్యక్రమ నిర్వహణ చేసారు.

మనోల్లాసానికి, మానసిక ఆరోగ్యానికి లలితకళలు దోహద పడతాయని,వాటిని ఆదరించడం, నేర్చుకోవడం వల్ల ప్రతి వ్యక్తికీ ఆరోగ్య ప్రయోజనం కలుగుతుందని వక్తలు అభిప్రాయ పడ్డారు. ఈ సందర్భం గా అర్ధనారీశ్వర కూచిపూడి అకాడమి విద్యార్థి చిన్నారి యశశ్రీ వెలిదండి నాట్యం అలరించింది.



**గురుధామ్-వరంగల్లు**

కార్తీక మాస సందర్భంగా ది.10.12.2023 న విదుషి విజయనగరం వర్ధని గారి(హైదరాబాద్) శిష్యబృందం దీక్షితార్ నవగ్రహ కీర్తనల బృందగానం వినిపించారు.




అడబాల ట్రస్ట్ కాకినాడ ఆధ్వర్యంలో ప్రముఖ సంగీతవిదుషి శ్రీమతి చావలి సూర్యకుమారి, కాకినాడ వారిని సత్కరించిన దృశ్యం.



**ఒంగోలు సంగీతసభ**

సుబ్రహ్మణ్య షష్టి సందర్భంగా ఒంగోలు లో18.12.23న శ్రీ యనమండ్ర శ్రీనివాసశర్మ గాత్రసంగీతసభ.శ్రీ చావలి శ్రీనివాస్ వయొలిన్, శ్రీ కె.వి. రామకృష్ణ మృదంగం.



భారతీయ విజ్ఞాన సమ్మేళనం-అహమ్మదాబాద్ లో 21.12.2023న ప్రొ॥హయతి వోరాజి నుండి అభినందన పత్రికను స్వీకరిస్తున్న 'స్వర' వీణాపాణి.

# వైకుంఠ ఏకాదశి సాంస్కృతిక ఉత్సవాలు.



భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం లో జరిగే వైకుంఠ ఏకాదశి సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా తేది:17-12-2023 పొలస వినయ్ కృష్ణ వయొలైన్ కచేరి శ్రోతలను ఆకట్టుకుంది. కార్యక్రమం లో నిన్ను కోరి (మోహన రాగం వర్ణం ఆది తాళం), శ్రీ రఘుకుల మందు (హంసధ్వని రాగం ఆది తాళం త్యాగరాజ స్వామి), అనుపమగుణాంబుధి (అఠాణ, త్యాగరాజ స్వామి) శ్రీ రమణ విభో (ఆరభి రాగం, ఆది తాళం, స్వాతి తిరునాల్) వంటి అంశాలు వినిపించారు. ఈ కార్యక్రమానికి నాగభూషణ శర్మ మృదంగం పై రాయప్రోలు సుబ్రహ్మణ్యం తాళం పై సహకారం చేశారు. అనంతరం కార్యక్రమ నిర్వాహకులు కళాకారులను సత్కరించారు.






గాయత్రీ మహిళా సంగీత సన్మండలి, గుంటూరు వారి ఆధ్వర్యంలో శ్రీ జి. ద్రోణేంద్ర ఫణికుమార్ వేణుగాన కచేరి లో శ్రీరాగవర్ణం, గౌళ లో మహాగణపతిమ్, పూర్వీకల్యాణిలో జ్ఞానమొసగరాదా, ప్రధానాంశంగా బిలహరి రాగంలో తొలిజన్మము మొదలైన అంశాలు రక్తిగా వినిపించారు. పద్మశ్రీ అన్నవరపు రామస్వామి ముఖ్య అతిథిగా విచ్చేసి కళాకారున్ని సత్కరించారు. కార్యదర్శిని శ్రీమతి యం.వై. శేషురాణి తదితర సభ్యులు కార్యక్రమ నిర్వహణ చేసారు.

## సంగీత లహరి, రాజమహేంద్రవరం



వారి డిసెంబర్ నెల కార్యక్రమంగా ప్రముఖ సంకీర్తన విద్వాంసులు శ్రీ ఆచంట లక్ష్మి శ్రీనివాస్ మరియు సలాది బ్రహ్మానందం గార్ల సంకీర్తన ఏర్పాటు చెయ్యడం జరిగింది. సర్వశ్రీ కె. గోవింద్, దివిలి దొరబాబు, K. వీరబాబు, A. రాంబాబు, భీమేష్, పుండరీకాక్ష, మరియు శ్రీరామచంద్రమూర్తి గాత్రసహకారం అందించారు. వీరికి హార్మోనీపై శివ, మృదంగం పై కె. సూరిబాబు మరియు పురుషోత్తం డోలు పై సహకరించారు. ఆద్యంతం కడు భక్తిగా జరిగిన ఈ కార్యక్రమం శ్రోతలను ఆనంద పరచింది.

## అలరించిన నామసంకీర్తన




డిసెంబర్ 9, 2023 న స్థానిక బృందావన గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదిక మీద శనివారం రాత్రి జరిగిన నామ సంకీర్తన ప్రేక్షకులను అలరించింది. మెరైన్ ఇంజినీర్ చంద్రశేఖర్ సౌజన్యంతో, చెన్నై నుంచి వచ్చిన నాదోపాసన సంస్థాన్ వనమాలి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. తొలుత ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్. మస్తానయ్య, ఉపాధ్యక్షుడు లంకా విజయబాబు, కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సంగీత విద్వాంసుడు శ్రీరామపాద భాగవతార్ భక్తి కీర్తనలను ఆలపించారు. గోకుల్ స్వామినాథన్ గాత్ర సహకారాన్ని అందించారు. మడిపాక హరిహరణ్, సంపత్ కుమార్, శ్రీనివాస్, రమేష్ రామచంద్రన్ వాద్య సహకారం అందించారు.

# సంకీర్తనోత్సవ్ - 2024


## సుజన రంజని - హోప్ టి.వి. - సాంప్రదాయ - తుంబురు - సామనిగమ ఆధ్వర్యంలో



30-12-2023 న శ్రీమతి కొల్లూరు వందన గాత్ర సంగీత సభ




31-12-2023 న కుమారి ఆర్.యల్. కృష్ణప్రియ గాత్ర సంగీత సభ



31-12-2023 న విదుషి సవితా శ్రీరామ్ బృందం అభంగగానం



01-01-2024 న విద్వాన్ శ్రీరామ్ జొన్నలగడ్డ గాత్ర సంగీత సభ



02-01-2024 న విద్వాన్ శ్రీ రమణ బాలచంద్రన్ వీణ కచేరి



03-01-2024 న విద్వాన్ శ్రీ యమ్.వి. సింహాచల శాస్త్రి భాగవతార్ హరికథ



04-01-2024 న అక్కరాయి సోదరీమణులు సుబ్బలక్ష్మి, స్వర్ణలత గాత్రయుగళం



05-01-2024 న విద్వాన్ శ్రీ రామకృష్ణన్ మూర్తి గాత్ర సంగీత సభ



06-01-24 న నామసంకీర్తన శ్రీ శ్రీకాంత్ కౌండిన్యన్ భాగవతార్, శ్రీ గణేశ్వర్ రామకృష్ణన్ భాగవతార్




7.1.24 న శ్రీ జొన్నలగడ్డ ఈశ్వరప్రసాద్ - శ్రీ జె.ఎస్.పరేశ్ అభినయం.

# శ్రీ శారదా సంగీత కళాసమితి,అనపర్తి -రజతోత్సవ(25) సభల దృశ్య మాలిక. 2.1.2024 నుండి 9.1.2024 వరకు.




2.1.24 న విదుషి పెద్దాడ సూర్యకుమారి ఆధ్వర్యంలో పంచరత్న కీర్తనల బృందగానం.



2.1.24 న వై.శిఖామణి భాగవతారిణి హరికథ.




3.1.24 న డా.బాచంపల్లి సంతోష్ కుమారశాస్త్రి-ప్రవచనం.




జనవరి 4,5,6 తేదీలలో శ్రీ గరికిపాటి నరసింహారావు -భారతంపై ప్రవచనం.




7.1.24 న వేదస్వస్తి.




7.1.24 న పెరవలి జయభాస్కర్ బృందం - వాద్యతరంగిణి.




8.1.24 న మల్లాది సోదరుల గాత్రయుగళం.




9.1.24 న డా. సంజయ్ శాంతారామ్ బృందం - బెంగుళూరు - భరతనాట్య - కూచిపూడి నృత్యప్రదర్శన.




రాగరసజ్ఞ, చెన్నై లో శ్రీమతి పంతుల రమ గాత్రసంగీత సభ. శ్రీ ఎమ్.ఎస్.ఎన్.మూర్తి-వయోలిన్; శ్రీపత్రి సతీష్ కుమార్-మృదంగం; వ్యాస విఠల్- కంజిర.



ఆంధ్రా అసోసియేషన్-న్యూఢిల్లీ లో సంగీత విభావరి సందర్భంగా సత్కరింపబడిన ఘంటసాల పాటల గాయకులు శ్రీ అంగాడి శివ ప్రసాద్-కాకినాడ.



విశాఖమ్యూజిక్ అకాడమి, విశాఖ వారి వార్షికోత్సవాలలో ‘‘మహాకాళి - డేన్స్ బాలే’’ ను సమర్పించిన ప్రొ. అనురాధ జొన్నలగడ్డ (హైదరాబాద్).



శ్రీ సంగమేశ్వర సంగీత సమాఖ్య, పిఠాపురం వారి ఆధ్వర్యంలో ప్రముఖ కవి శ్రీ ఆవంత్స సోమసుందర్ జయంతి సందర్భంగా విద్వాన్ శ్రీ ఆకొండి శ్రీనివాస రాజారావు గాత్ర సభ. శ్రీ హెచ్. రామ్ చరణ్ వైలన్, శ్రీ కె. యోగీష్ మృదంగం.



విశాఖమ్యూజిక్ అకాడమి, విశాఖ వారి వార్షికోత్సవాలలో Art India Foundation వారు అందించిన నృత్యకార్యక్రమంలో పాల్గొన్న నర్తకీమణుల బృందం



విశాఖమ్యూజిక్ అకాడమి, విశాఖ వారి వార్షికోత్సవాలలో శ్రీమతి అమృత వేంకటేశ్ (చెన్నయి).గానం

Editor & Publisher : Ganakala, M.Venkatarao
30-1-29, Rangayyanaidu St, Kakinada - 1, Cell, 9441488721